

ద్విచక్ర వాహనాల నుంచి లారీల వరకు అవసరమైన నాణ్యమైన విడి భాగాలు కావాలంటే స్పేర్‌పార్ట్స్ షాపులకు వెళ్లడం కన్నా తిరుపతి లోని అటవీ శాఖ కార్యాలయానికి వెళ్లడం మంచిదని వాహనదారులు భావిస్తున్నారట. ఇదేమిటనే అను మానం మీకు రావచ్చు. కానీ, దీని వెనుక ఉన్న అసలు కథ ఏంటో తెలిస్తే ఆశ్చర్యపోతారు.

- తిరుపతి (మంగళం), ఆంధ్రజ్యోతి

వాహనాల విడిభాగాలు కావాలా నాయనా!

అయితే.. అటవీశాఖకు పోదాం రండి

ఎర్రచందనం స్మగ్లర్లను పట్టుకోవడంలో వీరోచితంగా వ్యవహరిస్తున్న అటవీ శాఖ, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వాటిని మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. తాము దాడులు చేసి టన్నులకొద్దీ ఎర్రచందనం, భారీగా వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నామని చెబుతుంటారు. ఇందులో అత్యంత ఖరీదైన వాహనాలున్నాయని కూడా చెబుతారు. ఆ వాహనాలను కొంతకాలం తర్వాత అమ్ముదామంటే అవి తుక్కు కింద మాత్రమే పనికి వస్తున్నాయి. రూ.లక్షల విలువ చేసే వాహనాలు సైతం అమ్మకానికి పెడితే వేల రూపాయలు కూడా పలకడం లేదు. కారణమేమిటంటే వాహనాల్లోని ఖరీదైన, నాణ్యమైన విడిభాగాలు మాయమైపోవడమే.

చోరీకి కాదేది అనర్హం

అటవీ శాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకుంటున్న వాహనాలను కపిలతీర్థం వద్ద ఉన్న అటవీశాఖ కార్యాలయంలో ఉంచుతారు. పట్టుబడ్డ ఎర్రచందనాన్ని తిమ్మినాయుడుపాలెం వద్ద ఉన్న సెంట్రల్ గోడౌన్‌కు తరలిస్తారు. అయితే వాహనాలకు మాత్రం భద్రత లేకుండాపోతోంది. ఎవరైనా తమ వాహనాలకు కావాల్సిన విడిభాగాల కోసం వస్తే ఇక్కడున్న కొందరు కిందిస్థాయి ఉద్యోగులు, సిబ్బంది పట్టుబడ్డ వాహనం నుంచి ఊడబెరికి ఇచ్చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, లగేజ్ వాహనాలు, లారీలు ఇలా ఏది కావాలన్నా ఇక్కడ దొరుకుతున్నాయి. కొందరైతే ఏకంగా మెకానిక్‌ను తీసుకొచ్చి నాణ్యమైన పరికరాలను చూసి మరీ తీసుకెళుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. టైర్లు, రిమ్ములు, స్టీరింగ్ సిస్టం, ఇంజన్లో భాగాలు, బ్యాటరీలు, స్టీరింగ్, లాక్ సిస్టంలు చివరకు సీట్లను కూడా ఊడబెరికి అమ్ముకుంటున్నారు. ఇదిలావుండగా అటవీ శాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు కూడా పట్టుబడ్డ వాహనాల్లో ఖరీదైనవి, మంచి కండిషన్‌లో ఉన్నవి కనిపిస్తే అధికారులు వాటిపై ప్రభుత్వ వాహనం అని రాయించుకుని వాడేసుకుంటున్నారు.

ఆది నుంచి ఇదేతంతు

వాహన విడిభాగాల చోరీ, విక్రయాలు దశాబ్దాలుగా జరుగుతోంది. పట్టుబడిన సమయంలో వాహనాలు కండిషన్‌లో ఉన్నా కొంత కాలానికే తుక్కుగా కూడా పనికి రాకుండా చేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడుతోంది. తిరుపతి డివిజన్ పరిధిలో దాదాపు వెయ్యి వాహనాలు ఇలా మూలనపడి ఉన్నాయంటే అటవీ శాఖలో చేతివాటం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అటవీశాఖ, టాస్క్‌ఫోర్స్ ఉన్నతాధికారులు ఇప్పటికైనా దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



విడిభాగాలు మారుస్తున్న సిబ్బంది (ఫైల్ ఫొటో)

వేలంలో 153కు అమ్ముడుపోయింది 60 విడిభాగాలు ఊడబెరికిన ఫలితం ఈనెల 20న నిర్వహించిన వాహనాల వేలంలో కనిపించింది. కపిలతీర్థం వద్ద ఉన్న అటవీశాఖ కార్యాలయంలో 153 వివిధ వాహనాలను వేలానికి పెట్టగా 60 మాత్రమే అమ్ముడు పోయాయి. దీని వల్ల అటవీశాఖకు రూ.41,89,928 ఆదాయం చేకూరింది.

రూ.63,099 పలికిన బెంజ్‌కారు

మార్కెట్‌లో రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు ధర పలికే బెంజ్ కారును రూ.63,099కు వేలం పాటలో ఓ వ్యక్తి సొంతం చేసుకున్నాడు. ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడ్డ ఈ బెంజ్ కారు అటవీ శాఖ కార్యాలయానికి చేరుకున్న తర్వాత కేవలం రూ.63,099 పలికిందంటే దాని పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలా, మొత్తం 60 వాహనాలు సైతం మార్కెట్ ధరలకంటే చాలా తక్కువకు పాటదారులు దక్కించుకున్నారు. ఇందుకు కారణం అందులోని విలువైన విడిభాగాలు తొలగించి వేయడమేనన్న విమర్శలున్నాయి.

అధిక ధరలు వేశారట

పట్టుబడ్డ ఎర్రచందనం వాహనాలకు రెవెన్యూ అధికారులు అధిక ధరలు నిర్ణయించడంతో బహిరంగ వేలంలో అమ్ముడు పోలేదని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. తక్కువ ధర నిర్ణయించి ఉంటే అన్నీ అమ్ముడు పోయేవని అంటున్నారు. మిగిలిన వాహనాలకు మరోసారి వేలం నిర్వహిస్తామన్నారు.

ఫిర్యాదును విచారిస్తున్న ఎస్పీ





పీజీఆర్‌ఎస్‌లో పాల్గొన్న సీఐలు

మీ సమస్య ఎందుకు పరిష్కారం కాలేదంటే!

- పోలీస్ పీజీఆర్‌ఎస్‌లో వినతులపై కారణాల నమోదు తప్పనిసరి
- ఇద్దరు అదనపు ఎస్పీల ఆధ్వర్యంలో 9 మంది సీఐల పరిశీలన
- అర్జీదారులను తిప్పించుకోకుండా ఎస్పీ చర్యలు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అర్జీదారుల సమస్యలు ఏ స్థాయిలో ఉన్నాయి? అవి పరిష్కారం అవుతాయా? కావంటే కారణాలు ఏంటి? ఎన్నేళ్లుగా ఆ సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి? ఇలా ఆయా సమస్యలపై సీఐలు అధ్యయనం చేసి అర్జీలపై స్పష్టంగా నోట్ చేయాలి. సగం సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించేలా చొరవ చూపాలి. అర్జీదారుల్లో నమ్మకం, భరోసా కలిగించాలి. ఈ దిశగా జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)'కు ఎస్పీ హర్షవర్ధనరాజు మార్పులు తీసుకొచ్చారు. గతానికి భిన్నంగా ఈ సోమవారం నుంచే అమలు చేశారు. ఈ కార్యక్రమం కోసం ప్రతి సబ్ డివిజన్ నుంచి ఒక సీఐ వంతున తొమ్మిది మందిని రప్పిస్తారు. ఒక సబ్ డివిజన్ పరిధిలో నలుగురు సీఐలు ఉంటే.. ఒక్కొక్కరు ఒక్కో సోమవారం వంతున వస్తారు. వీరంతా తమ సబ్ డివిజన్ల పరిధిలో నుంచి వచ్చే అర్జీదారులను కూర్చోపెట్టుకుని ఓపికగా వారి సాధక బాధలు వినాలి. వినతులను పరిశీలించి సాధ్యమైనంత వరకు జిల్లా ఎస్పీ కార్యాలయంలోనే పరిష్కరించాలి. పరిష్కారం ఆలస్యమైనా.. ఒకవేళ సాధ్యం కాకున్నా అందుకు కారణాలను ఆయా వినతులపై నోట్ చేయాలని ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాలు జారీ చేశారు. ఇలా అర్జీదారులకు జవాబుదారీతనంగా ఉండేలా చేపట్టిన తొలి పీజీఆర్‌ఎస్‌కు అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు ఆధ్వర్యంలో సీఐలు శ్రీరాముడు (తిరుమల), సురేంద్రనాయుడు (పుత్తూరు), హాస్సేన్‌బాషా (వాకాడు), మురళీకృష్ణ (రేణిగుంట రూరల్), ఇమ్రాన్ బాషా (భాకరాపేట), శ్రీనివాసులు (శ్రీసిటీ), మురళీమోహన్ (తిరుపతి వెస్ట్), సంగమేశ్వరరావు (నాయుడుపేట రూరల్), సాదిక్‌ఆలీ (స్పెషల్ బ్రాంచి) పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దాదాపు 110 మంది నుంచి అర్జీలు తీసుకుని ప్రత్యేక కౌంటర్ ద్వారా వాటిని పరిశీలించి నెంబరు కేటాయించి ఆయా సబ్ డివిజన్ల సీఐల వద్దకు పంపారు. ఈ అర్జీల్లో ఎక్కువగా భూ సమస్యలు, భార్యాభర్తల వివాదాలు, కొట్లాటలు, పోలీసు స్టేషన్లకు వెళితే సరైన సమాధానం లేదని, సిబ్బంది కొందరు ప్రజల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారని, ఆర్థిక లావాదేవీలు, ఆన్‌లైన్ సమస్యలు, సైబర్ క్రైం కేసులు వంటి వాటిపై ఎక్కువగా వచ్చాయి.

మార్పు ఎందుకంటే?

ఇప్పటి వరకు ఇద్దరు అదనపు ఎస్పీల ఆధ్వర్యంలో ఒక సీఐ, ఒక ఎస్ఐ పాల్గొని పీజీఆర్‌ఎస్‌లో వచ్చే అర్జీలు స్వీకరించేవారు. వాటిని పరిశీలించి సంబంధిత డీఎస్పీలు, సీఐలకు పంపి పరిష్కరించాలని సూచించేవారు. అయినా, ఒక సమస్యపైనే కొందరు పది సార్లు ఎస్పీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఆయా పోలీసు స్టేషన్లకు వీరి అర్జీలను పంపినా.. మళ్లీ వ్యయప్రయాసలకు ఓర్చి తిరుపతికి వస్తున్నారు. దీనిని గమనించిన ఎస్పీ హర్షవర్ధనరాజు.. పీజీఆర్‌ఎస్‌లో ఇచ్చే అర్జీలకు జవాబుదారీతనం కల్పించి.. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించి ప్రజల్లో పోలీసుశాఖ పట్ల నమ్మకం పెంచేలా ఈ మార్పును తీసుకొచ్చారు.

మా నగలు ఉన్నాయా?

బ్యాంకుకు ఖాతాదారుల పరుగు

30 మంది బాధితుల జాబితా ప్రదర్శన ● రికవరీకి హామీ



బ్యాంకు వద్ద ఖాతాదారులు

నాగలాపురం, ఫిబ్రవరి 24, (ఆంధ్రజ్యోతి): నాగలాపురంలోని యూనియన్ బ్యాంకుకు సోమవారం పలువురు ఖాతాదారులు క్యూ కట్టారు. తమ నగలు ఉన్నాయా అంటూ సిబ్బందిని ఆరా తీశారు. డిప్యూటీ మేనేజర్ సూర్యతేజ్ చేతివాటం చూపి ఖాతాతారులకు సంబంధించిన 5,498 గ్రాముల బంగారు నగలను తీసుకెళ్లి బయట తనఖా పెట్టి రూ.2.35 కోట్లు తీసుకున్న విషయం తెలిసిందే. దీనిపై యూనియన్ బ్యాంకు తిరుపతి రీజనల్ డీజీఎం బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు బ్యాంకు మేనేజర్ తిరువరాజ్, డిప్యూటీ మేనేజర్ సూర్యతేజ్‌పై ఎస్ఐ సునీల్ శుక్రవారం కేసు నమోదు చేశారు. దీంతో గోల్డ్ లోన్ తీసుకున్న వారిలో ఆందోళన నెలకొంది. శని, ఆదివారాలు సెలవు కావడంతో.. సోమవారం ఖాతాదారులు బ్యాంకుకు వచ్చారు. కాగా, డిప్యూటీ మేనేజర్ సూర్యతేజ్ 30 మంది ఖాతాదారుల నగలను బయట ప్రాంతాల్లో కుదువ అంగళ్లు, ఫైనాన్స్ సంస్థల్లో కుదువపెట్టినట్లు గుర్తించారు. ఈ 30 మంది ఖాతాదారుల జాబితాను అధికారులు బ్యాంకులో అతికించారు. వీరి నగలు రికవరీ చేసిచ్చేందుకు హామీ ఇచ్చారు. మరోవైపు మిగిలిన 36 మంది ఖాతాదారులు తమ నగలను విడిపించుకునేందుకు ఎగబడ్డారు.

సీఐ కార్యాలయాన్ని సంప్రదించండి

సత్యవేడు సీఐ మురళి సోమవారం బ్యాంకు అధికారులతో విచారణ కొనసాగించారు. ఘటనపై సిబ్బందిని, బ్యాంకు అధికారులను అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. 30 మంది జాబితాలోని ఖాతాదారులు బ్యాంకులో కుదువ పెట్టిన నగలకు సంబంధించిన రసీదులతో సత్యవేడు సీఐ కార్యాలయాన్ని సంప్రదించి విచారణకు సహకరించాలని ఆయన కోరారు. మరో రెండు మూడు రోజుల్లో విచారణ పూర్తి చేస్తామని, నగల రికవరీకి కొంత వ్యవధి పడుతుందన్నారు.

అధికారులే బాధ్యత వహించాలి

నా కుటుంబ అవసరాల నిమిత్తం 2024 జూలై 26వ తేదీన 234 గ్రాముల బంగారు నగలను తాకట్టుపెట్టి రూ.3.9 లక్షల రుణం తీసుకున్నా. 30 మంది బాధిత ఖాతాదారుల జాబితాలో నా పేరూ ఉంది. నా నగలకు బ్యాంకు అధికారులే బాధ్యత వహించాలి.

- చిట్టిబాబు, నాగలాపురం

స్విమ్స్‌లో జీబీఎస్ అనుమానిత కేసులు

తిరుపతి(వైద్యం)/చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి):ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్న జీబీఎస్ (గులియన్ బారే సింద్రోమ్) వైరస్ సోకిందన్న అనుమానంతో 17మంది తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని స్విమ్స్ అధికారులు ధ్రువీకరించడం లేదు.జీబీఎస్ వైరస్ గురించి భయపడాల్సిన పనిలేదని వైద్యాధికారులు చెబుతున్నారు.ఇది అంటువ్యాధి కాదని, దీనికోసం స్విమ్స్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేయలేదని తెలిపారు. చికిత్స పొందుతున్న వారిలో చిత్తూరు జిల్లా గంగవరం మండలానికి చెందిన 41ఏళ్ల వ్యక్తి, పలమనేరు మండలానికి చెందిన మహిళ వున్నారని సమాచారం. ప్రస్తుతం వీరి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిసింది.

దశకంఠుడిపై పరమశివుడి విహారం



రావణ, మయూర వాహనాలపై స్వామిఅమ్మవార్ల పురవిహారం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నాల్గో రోజైన సోమవారం రాత్రి జగద్రక్షకుడైన పరమశివుడు రావణవాహనంపై అధిరోహించి పురవిహారం చేశారు. ఆయన పక్కనే జ్ఞానప్రసూనాంబ అమ్మవారు మయూర వాహనంపై ముందుకు సాగారు. అంతకుముందు అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవర్లకు విశేష అలంకరణలు, పూజలు నిర్వహించారు. యాగశాల పూజలు జరిగాయి. ఉదయం బంగారు హంస వాహనంపై స్వామివారు, బంగారు యాళివాహనంపై జ్ఞానప్రసూనాంబ అమ్మవారు ఊరేగారు. ఉదయం, రాత్రి స్వామి, అమ్మవార్ల ఊరేగింపును మూషిక వాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప అనుసరించారు. వాహన సేవల ముందు కోలాట కళాకారుల నృత్యాలు, భక్తుల శంఖానాదం, శివనామస్మరణలు మార్మోగాయి. మాడవీధుల్లో ఉత్సవర్లను భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలు పలికారు. ఉభయదారులుగా కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన చిట్టాప్రగడ సీతారామాంజనేయులు కుటుంబ సభ్యులు.. జూలుగంటి సుబ్బారావు, నాగలక్ష్మి వ్యవహరించారు. ఆలయ ఈవో బాపిరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 9 గంటలకు: హంస-శుక వాహన సేవలు
- రాత్రి 8 గంటలకు: శేష-యాళి వాహన సేవలు

హంస, యాళివాహనాల్లో ఉత్సవర్లు



నేడు సారె సమర్పణ

స్వామి, అమ్మవార్లకు మంగళవారం మధ్యాహ్నం రాష్ట్ర ప్రభుత్వం తరపున సారె సమర్పించనున్నారు. మధ్యాహ్నం రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టు వస్త్రాలను తీసుకురానున్నారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు

● అధికారులను నిలదీసిన కూలీలు



గ్రామ సభలో ఏపీవోని నిలదీస్తున్న మహిళ

చంద్రగిరి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అగరాల పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు బయటపడ్డాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం కింద చేపట్టిన పనులపై క్షేత్రస్థాయి సామాజిక తనిఖీలో భాగంగా సోమవారం గ్రామసభ జరిగింది. సుమారు రూ.10 లక్షల మేర అభివృద్ధి పనులు జరిగితే, కూలీలు హాజరుకాకపోయినా హాజరైనట్లు రికార్డులు సృష్టించి రూ.60 వేలు స్వాహా చేసినట్లు తెలిసిందని డీఆర్పీ మహేష్ తెలిపారు. పనులకు వెళ్లకుండానే బినామీ పేర్లు పెట్టి, అసలైన కూలీలను మోసం చేసి సుమారు రూ.4.16 లక్షలను ఉపాధి సిబ్బంది స్వాహా చేసినట్లు సర్పంచ్ భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. విచారణ జరిపించి బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పనులకు రానివారికి బిల్లులెలా పెడతారని కొందరు కూలీలు అధికారులను నిలదీశారు. ఏపీవో జ్యోతి తదితరుల పాల్గొన్నారు.

ముక్కోటిలో వైభవంగా రథోత్సవం



చంద్రగిరి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తొండవాడ స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం శివనామ స్మరణలతో మారుమోగింది. రాత్రి కామధేను వాహనంపై పార్వతీపరమేశ్వర్లు దర్శనమిచ్చారు. తొలుత ఉదయం 6 గంటలకు స్వామికి రుద్రాభిషేకం, ఆనందవల్లీదేవికి అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. 7.30 గంటలకు వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన రథంలో పరమశివుడు అధిష్టించారు. ఆలయ ప్రదక్షణగా రథోత్సవాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి కామధేను వాహనంపై అధిష్టించి ఆలయ ప్రదక్షణగా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నోషనల్ ఖాతా భూములకు విముక్తి కల్పించండి



పాకాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నోషనల్ ఖాతా భూములను రైతుల పేరుతో మార్చాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత కోరారు. తహశీల్దార్ సంతోష్‌సాయికి సోమవారం ఆమె ఈమేరకు వినతి పత్రం అందజేశారు. 2013లో 137 మంది రైతులకు సంబంధించిన భూములు వరసిద్ధి వినాయకస్వామి పేరుతో నోషనల్ ఖాతాలో నమోదయ్యాయన్నారు. 12 సంవత్సరాలుగా అధికారులకు ఫిర్యాదులు చేసినా ఈసమస్య పరిష్కారం కాలేదన్నారు. రెవెన్యూ సదస్సుల్లో కోరినా స్పందించలేదన్నారు. ఇప్పటికైనా చొరవతీసుకుని నోషనల్ ఖాతాలోని భూముల సమస్య పరిష్కరించాలని కోరారు. క్రయ విక్రయాలకు, బ్యాంకు రుణాలు తీసుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వినతిపత్రం అందజేసినవారితో రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదనరావ్, నాయకులు సుగుణమ్మ, గుణశేఖర్ రెడ్డి, ఆదికేశవులు రెడ్డి, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాత ఔదార్యంతో విద్యార్థులకు శుద్ధ తాగునీరు

ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): బోడేవాండ్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తిరుపతికి చెందిన డాక్టర్ హేమకుమార్‌రెడ్డి రోజూ శుద్ధ తాగునీటిని అందిస్తున్నారు. సోమవారం క్యాన్ల ద్వారా తాగునీటి సరఫరాకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చిన్నపుడు చదువుకున్న గ్రామంలోని విద్యార్థులకు రక్షిత నీరు కల్పించడం సంతోషంగా ఉందన్నారు. నిత్యం ఇంటి నుంచి తాగునీరు తెచ్చుకోవడం పిల్లలకు కష్టంగా ఉందని ప్రధానోపాధ్యాయుడి చెప్పడంతో తాను స్పందించానన్నారు. త్వరలో వాటర్ ప్యూరిఫైడ్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు ,ఉపాధ్యాయులు రెడెప్ప నాయుడు, స్వరూప, లావణ్య, రాధిక, భారతి, సిద్ధేశ్వర్, సిద్ధరామిరెడ్డి తదిరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతం



సేంద్రియ ఎరువులను తయారు చేస్తున్న దృశ్యం

రామచంద్రాపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం తోనే భూమిని కాపాడవచ్చని గుంటూరు వ్యవసాయశాఖ ప్రధాన కార్యాలయ అధికారి నరేంద్ర అన్నారు. సోమవారం గంగిరెడ్డిపల్లి, కుప్పంబాదూరు యూనిట్ల పరిధిలో పలు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తున్న రైతుల పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ప్రతి రైతును ప్రకృతి వ్యవసాయంవైపు ప్రోత్సహించాలన్నారు. మండల టీం ఇన్‌ఛార్జి విమల, ఎన్ఎఫ్ఏ ప్రతినిధులు స్వామి కొండయ్య, యూనిట్ ఇన్‌ఛార్జిలు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

కనులపండువగా శివపార్వతుల కల్యాణం



రామచంద్రాపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పారకాల్వలో రాజరాజేశ్వరిదేవి ఆలయంలో రాస్ ఆధ్వర్యంలో సోమవారం శివపార్వతుల కల్యాణం కమనీయంగా సాగింది.వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఈ వేడుక జరిగింది. సుమారు 400మంది మహిళలు ఉపవాస దీక్షతో ఆలయం వద్ద ఉసిరి దీపాలను వెలిగించారు. రాస్ డైరెక్టర్ నాగరాజు మాట్లాడుతూ మహాశివరాత్రికి ముందస్తుగా శివపార్వతుల కల్యాణం చేయడం మంచిదని పురాణాలు చెబుతున్నాయన్నారు. కార్యక్రమంలో అర్చకులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పీలేరు నుంచి తలకోనకు బస్సు సర్వీస్ ప్రారంభం



ఎర్రావారిపాలెం,ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పీలేరు-తలకోనకు బస్సు సర్వీసును సోమవారం తలకోనట్రస్ట్ ఛైర్మన్ సోమనాథరెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని ఇటీవల అధికారుల సమీక్షా సమావేశంలో తలకోన అభివృద్ధి చేపట్టాల్సిన అంశాలను చర్చించారు. ఈ క్రమంలో పీలేరు నుండి భాకరాపేట మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీసు నడపాల్సిన అవసరాన్ని గుర్తించారు. ఎమ్మెల్యే ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి బస్సు సర్వీసును ఏర్పాటు చేయించారు. సోమవారం ఈ సర్వీసును ట్రస్ట్ ఛైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి 50 వేల లడ్డూల తయారీ



భాకరాపేట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా తలకోనలో భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదాన్ని అందించనున్నట్లు దాత వలసారెడ్డి శివప్రసాదరెడ్డి తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారి గడ్డకు చెందిన జడ్పీ మాజీ ఛైర్మన్, దివంగత సిద్దరామిరెడ్డి కుటుంబసభ్యులు కొల్లాపురమ్మ ఆలయ ఆవరణలో సోమవారం లడ్డూ తయారీకి శ్రీకారం చుట్టారు. ఏటా శివరాత్రికి వీరు అన్నదానం చేస్తారు. ఈ ఏడాది 50 వేల లడ్డూలను ప్రసాదంగా అందజేయనున్నారు. తలకోనలో ఇప్పటికే అన్నదాన సత్రం నిర్మించారు. అన్నదానం కూడా చేస్తున్నారు.

గ్రామాలకు బస్సు సర్వీసుల రద్దు

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం శ్రీశైలం, మల్లయ్యకొండ, శ్రీకాళహస్తి, కోటప్పకొండ, తలకోనకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. కావున తిరుపతి డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సులను మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చేనెల 2వ తేదీ నుంచి యథావిధిగా బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. విరాటపురం, వెంకట్రామాపురం, పళ్లిపట్టు, రేణిగుంట-చంద్రగిరి, పాకాల, అనుప్పల్లె, అప్పలాయిగుంట, పెనగలూరు, ఓఎస్ గొల్లపల్లి, మూలపల్లి, అడపారెడ్డిపల్లి, గాజంకి, కాణిపాకం, బెంగళూరు, విజయవాడ మొత్తం సర్వీసులు తాత్కాలికంగా రద్దు చేశారు. కాగా ఆర్టీసీ నిర్ణయంపై ప్రయాణికులు మండిపడుతున్నారు.

కాలినడకన తిరుమలకు నిహారిక



తిరుమల, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): నటుడు నాగబాబు కుమార్తె, నటి నిహారిక సోమవారం తిరుమలకు వచ్చారు. అలిపిరి నుంచి కాలినడకను ప్రారంభించిన ఆమె సాయంత్రానికి తిరుమలకు చేరుకున్నారు. మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

శ్రీవారిసేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ లలిత

తిరుమల, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె లలిత, ఏపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, తెలంగాణ శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు నేతి విద్యాసాగర్ ఉన్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

రేపు తిరుమల క్షేత్రపాలకునికి ప్రత్యేకాభిషేకం

తిరుమల, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని గోగర్భ సమీపంలో రుద్రుడి రూపమైన క్షేత్రపాలకుడికి మహాశివరాత్రి సందర్భంగా బుధవారం ప్రత్యేక అభిషేకం నిర్వహించనున్నారు. ఈక్రమంలో శ్రీవారి ఆలయం నుంచి అధికారులు, అర్చకులు క్షేత్రపాలక శిలవద్దకు చేరుకుంటారు. మధ్యాహ్నం 3 గంటలకు సుగంధ ద్రవ్యాలతో క్షేత్రపాలకునికి అభిషేకం చేసి నైవేద్యం సమర్పిస్తారు. భక్తులకు ప్రసాదాల వితరణ చేస్తారు. ఉదయం తిరుమల స్థానికులు, వ్యాపారులు కూడా క్షేత్రపాలకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేస్తారు.

కోటిలింగేశ్వరస్వామి సేవలో దర్శకుడు నందకిషోర్



రామచంద్రాపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట కామాక్షి సమేత కోటిలింగేశ్వరస్వామిని సినీ దర్శకుడు అబ్బూరి నందకిషోర్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు సాదర స్వాగతం పలికి స్వామి వారి దర్శనం కల్పించారు. కమ్మకండ్రిగ గ్రామానికి చెందిన నందకిషోర్ 20రోజుల క్రితం తీసుకున్న శివదీక్ష విరమణ కోసం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన దర్శకత్వంలో అక్కినేని అఖిల్ నటిస్తున్న లెనిన్ చిత్రం విజయవంతం కావాలని స్వామివారిని ప్రార్థించినట్లు చెప్పారు.

భక్తురాలి పట్ల అసభ్య ప్రవర్తన

●వ్యక్తికి దేహశుద్ధి

తిరుమల, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తురాలితో అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ యువకుడికి దేహశుద్ధి చేశారు. యాత్రికుల వసతి సముదాయం-2(మాధవ నిలయం)లో సోమవారం వేకువజామున ఓ భక్తురాలితో పట్ల ఒక యువకుడు అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు చేరుకున్నారు. యువకుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. తొలుత చైన్‌స్నాచింగ్ ప్రయత్నించాడని చెప్పడంతో విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకుని విచారించారు. తర్వాత అసలు విషయాన్ని తెలుసుకున్నారు. బాధితురాలు కనికరించి ఫిర్యాదు చేసేందుకు నిరాకరించడంతో ఆ యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

పీఎం కిసాన్ నిధుల విడుదల

తిరుపతి(ఎంఆర్.పల్లె), ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): రబీకి సంబంధించి 19వ విడత పీఎం కిసాన్ నిధులు రూ.28.05 కోట్లు విడుదలయ్యాయి. రైతులకు ఏడాదికి రూ.6 వేలు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు మూడు విడతల్లో రూ.2 వేలు చొప్పున జమవుతోంది. జిల్లా పరిధిలో 1.40 లక్షల మంది రైతులకు రూ.28.05 కోట్లు విడుదలైంది.

పరాశరేశ్వరా..పాహిమాం..



యోగిమల్లవరంలో పరాశరేశ్వరుడి ఆలయం

తిరుచానూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వేదాలను ప్రపంచానికి అందించిన వ్యాసుడి తండ్రి పరాశరుడు స్వయంగా ప్రతిష్టించిన శివలింగమిది. తిరుచానూరు పంచాయతీలో యోగిమల్లవరంలో ఇది కొలువుదీరి భక్తుల పూజలందుకుంటోంది. ఇక్కడి కామాక్షాంబ సమేత పరాశరేశ్వరస్వామి ఆలయానికి వెయ్యేళ్ల చరిత్ర ఉంది. క్రీ.శ. 1008లో చోళరాజు రాజరాజేశ్వరుడు ఆలయాన్ని నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది.

మన శివాలయాలు

స్థల పురాణమిది..

క్షేత్రం వెనుక ఆసక్తికరమైన స్థల పురాణం ఉంది. పరాశరుడు వశిష్ట మహర్షి మనుమడు. ఇతడి తల్లిదండ్రులు శక్తి, అదృష్యంతులు. పరాశరుడు తల్లి గర్భంలో ఉండగానే ఒక రాక్షసుడు అతని తండ్రిని సంహరించాడు. పరాశరుడు పెద్దవాడయ్యాక విషయం తెలుసుకుని తండ్రిని చూపించాలని శివుడ్ని ప్రార్థిస్తాడు. శివుడి వరం మేరకు ఆ మహర్షి స్వర్గంలో ఉన్న తండ్రిని దర్శించగలుగుతాడు. దీంతో తాను ప్రార్థించిన స్థలంలో పరాశర మహర్షి శివుడ్ని లింగరూపంలో ప్రతిష్టించాడని చెబుతారు.. అందుకే ఇక్కడి శివుడ్ని పరాశరేశ్వరస్వామిగా పిలుస్తారు..



ప్రదోష పూజకు ప్రాధాన్యం

ఈ ఆలయంలో ప్రదోష పూజకు ప్రాధాన్యం ఉంది. ప్రతినెలా అమావాస్య, పౌర్ణమిల ముందు వచ్చే త్రయోదశినాడు సాయంత్రం 4.30-6గంటల మధ్య ఈపూజను శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శివానుగ్రహానికి పాత్రులవుతారు. మహాశివరాత్రి సందర్భంగా మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడానికి దేవదాయశాఖ ఏర్పాట్లు చేసింది. తొలిరోజు సాయంత్రం నందీశ్వరునికి ప్రదోష పూజ అభిషేకం చేస్తారు. బుధవారం వేకువజాము నుంచి రాత్రి వరకూ స్వామివారికి విశేష అభిషేకాలు చేస్తారు. గురువారం ఏకాంతసేవ , శుక్రవారం కల్యాణోత్సవం జరుగుతుందని అర్చకులు తెలిపారు

చికెన్, కోడిగుడ్ల వినియోగంపై అవగాహన



చికెన్ వంటకాల వడ్డన

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక బైరాగిపట్టెడలోని బాబు జగజ్జీవన్‌రామ్ పార్కులో సోమవారం చికెన్, కోడిగుడ్ల వినియోగంపై అవగాహన కల్పించారు. పశుసంవర్ధక శాఖ అధికారి రవికుమార్ మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో బర్డ్‌ఫ్లూ ఎక్కువగా రావడంతో అక్కడి ప్రజలు చికెన్, కోడిగుడ్లు తినడానికి భయపడ్డారన్నారు. మన జిల్లాలో ప్రమాదం లేదన్నారు.నిరభ్యంతరంగా తినొచ్చన్నారు. సోషల్ మీడియాలో ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. చికెన్, గుడ్లు తినడం వలన కలిగే లాభాలను వివరించారు. హోమ్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, ఉమామహేశ్వరి, ఎన్ఈసీసీ ఛైర్మన్ శ్రీనివాసులునాయుడు, బాలాజీ, హెచరీస్ ప్రణీత్ పాల్గొన్నారు.



చికెన్ వంటకాన్ని తింటున్న రవికుమార్,తదితరులు

పనితోనే పాట ప్రస్థానం: సుద్దాల అశోక్‌తేజ



మాట్లాడుతున్న సుద్దాల అశోక్‌తేజ

తిరుపతి రూరల్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): అలుపు లేకుండా గెలుపు కోసం పోరాడాలని సినీ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ విద్యార్థులకు సూచించారు. తనపల్లె శ్రీవారి టెంపుల్ బెల్స్ లేఅవుట్‌లోని శ్రీనిలయంలో సోమవారం రాత్రి మాట-పాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అశోక్‌తేజ మాట్లాడుతూ..పనితోపాటే పాట పుట్టిందన్నారు. పాట పనితో జతకట్టిందన్నారు. సాహిత్యంపై తన ఇష్టాన్ని పంచుకున్నారు. గౌరవఅతిథిగా హాజరైన డాక్టర్ నన్నం ధర్మయ్య మాట్లాడుతూ రైతులు, ఆడపిల్లలు, ఆకలి, వలసకూలీలు, లంబాడి తల్లులు, పేదరికంపై అశోక్‌తేజ ఎన్నో పాటలు రాశారన్నారు. తండ్రి సుద్దాల హనుమంతు నుంచి ఆయనకు పాటలు పాడడం వారసత్వంగా అబ్బిందన్నారు. ప్రొఫెసర్ గార్లపాటి దామోదరనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ జలగం రామాంజులు, తుడాసెక్రటరి డాక్టర్ గుండ్రాతి వెంకటనారాయణలు అతిథులుగా హాజరయ్యారు. నిర్వాహకులు డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. అశోక్‌తేజ దాదాపు 10పాటలను ఆలపించి యువతలో ఉత్సాహం నింపారు.

జూబ్లీహిల్స్‌లో బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన



ఆలయంలో అధికారులతో మాట్లాడుతున్నఈవో శ్యామలరావు

తిరుమల, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26 నుంచి మార్చి 6 వరకు జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను టీటీడీ ఈవో శ్యామలరావు సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25వ తేదీ సాయంత్రం అంకురార్పణ, 26న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మార్చి2న గరుడవాహనం, 5న రథోత్సవం, 6న చక్రస్నానం నిర్వహిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేసినట్టు ఆయన తెలిపారు.

మంగళగిరికి వైసీపీ అసమ్మతి కార్పొరేటర్లు

● పవన్ సమక్షంలో నేడు జనసేనలో చేరిక

తిరుపతి, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): వైసీపీ అసమ్మతి కార్పొరేటర్లు జనసేన పార్టీలోకి చేరేందుకు మంగళగిరికి పయనమయ్యారు. మంగళవారం జనసేన అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన కండువా కప్పుకోనున్నారు. ఎన్నికల ముందు జనసేన పార్టీలో చేరిన కల్పన, రేవతి, వట్టికుంట నారాయణతో పాటు ఎస్కే బాబు, పొన్నాల చంద్ర, తిరుత్తణి శైలజ, కుడితి సుబ్రమణ్యం, ఆదం లీలావతి, ఆవుల రాధ, రత్నకుమారి పార్టీలో చేరేందుకు సిద్దమైనట్టు తెలిసింది. వీరిలో పలువురు సోమవారం సాయంత్రం మంగళగిరి బయలుదేరారు.కాగా నరసింహా చారి, నరేంద్రనాధ్‌లు వ్యక్తిగతకారణాల వలన మంగళగిరి ప్రయాణం విరమించుకున్నట్టు సమాచారం. వీరితోపాటు వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడుగా పనిచేసిన బాలిశెట్టి కిషోర్ తన అనుచరగణంతో జనసేనలో చేరేందుకు వెళ్లారు. వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా పనిచేసిన కిషోర్ ఎన్నికల తర్వాత వైసీపీని వీడారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆయన తనయుడు మదన్ నేతృత్వంలో జనసేన తీర్థం పుచ్చుకోనున్నారు.

పాత కక్షలతో హత్యకు కుట్ర!

● పట్టుకున్న పోలీసులు

● అదుపులో ముగ్గురు నిందితులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పాత కక్షలతో హత్యకు కుట్ర పన్నిన ముగ్గురు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఐదేళ్ల కిందట తిరుపతిలోని ఐఎస్ మహల్ వద్ద దినేష్‌ను హత్య చేసిన కేసులో నెహ్రూనగర్‌కు చెందిన వినయ్, అతడి స్నేహితులు నరసింహ, శ్రీను నిందితులు. ఈ ముగ్గురూ కలిసి దినేష్ స్నేహితుడు గిరిపురానికి చెందిన మల్లికార్జునను హతమార్చాలని పథకం వేశారు. వినయ్, నరసింహ, శ్రీను కలిసి రెండు పదునైన కత్తులు సిద్ధం చేసుకున్నారు. నెల రోజులుగా మల్లికార్జున కదలికలపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో మల్లికార్జునను ఆదివారం రాత్రి రుయాస్పత్రి వద్దకు పిలిపించి మాటల్లో దింపారు. అందరూ కలసి మద్యం తాగారు. ఆ తర్వాత మల్లికార్జునను మట్టుపెట్టాలని నిందితులు భావించారు. వారి మాటలు, ప్రవర్తనను అనుమానించిన మల్లికార్జున వెంటనే అప్రమత్తమై డయల్ 100కు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. తిరుపతి వెస్ట్ బ్లూకోల్ట్స్ సిబ్బంది రుయాకు చేరుకుని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా హత్యకు కుట్ర విషయం బయటకు వచ్చింది. వారి నుంచి రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మద్యంతో పాటు గంజాయి తీసుకున్నట్లు సమాచారం. నిందితుల వద్ద కొంత గంజాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

ఉగ్రప్రత్యంగిరా కాళిపీఠం వార్షికోత్సవాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తొండవాడ సమీపంలోని ఉగ్రప్రత్యంగిరా కాళిపీఠం వార్షికోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. సోమవారం నుంచి మార్చి 1 వరకు వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించాక కొడిస్థంభావిష్కరణ జరిగింది. సాయంత్రం సహస్రనామార్చన, ప్రదోషకాల పూజ, మంత్రపుష్పం, హారతి కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో పీఠాధిపతి సూరిస్వామి, వేదపండితులు సీతారామశర్మ, కార్యనిర్వాహకులు శివశంకరప్రసాద్, రామమూర్తినాయుడు పాల్గొన్నారు. .

మహాశివరాత్రి ఉత్సవాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కందులవారిపల్లె సమీపంలోని శ్రేషాచలలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి గురువారం వరకు మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. మంగళవారం కలశ స్థాపన, గణపతి, నవగ్రహ, రుద్ర దుర్గ హోమాలు నిర్వహిస్తారు.

5నాటికి పల్లెపండుగ పూర్తికావాలి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులు మార్చి 5వ తేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆయన పంచాయతీ, డ్వామా అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లక్ష్యం మేరకు సీసీ రోడ్డు నిర్మాణాలు, ఇంజనీరింగ్ పనులు, అనిమల్ షెడ్స్ పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈఈ, డీఈలు, ఏఈలు తదితర అధికారులు పాల్గొన్నారు.

మార్చి 9 వరకు ప్యాసింజర్ రైళ్ల రద్దు పొడిగింపు

తిరుపతి(సెంట్రల్) ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే నుంచి కుంభమేళాకు పంపిన ప్యాసింజర్ రైళ్లలో 12 రైళ్ల రద్దును మార్చి 9వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో తిరుపతి నుంచి కదిరిదేవరపల్లి, గుంతకల్లు, హుబ్లీ, కాట్పాడి మధ్య రోజువారీ రాకపోకలు నిర్వహించే మెమో, డెమో ప్యాసింజర్లను ఈనెల 28 వరకు రద్దు చేసిన విషయం విదితమే. వీటిని ఆయా మార్గాల్లో మార్చి 9 వరకు రద్దు చేస్తున్నట్లు వివరించారు.

ప్రత్యేక బస్ సర్వీసులు

సత్యవేడు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 25, 26, 27 తేదీల్లో సత్యవేడు డిపో నుండి 25 ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడుపుతున్నట్లు స్థానిక ఆర్టీసీ డీఎం వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట సైబర్ మోసం

● రూ.24.66 లక్షలు పోగొట్టుకున్న ఎస్వీయూ ఫ్యాకల్టీ ప్రొఫెసర్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సైబర్ వలలో పడి తిరుపతి ఎస్వీయూనివర్శిటీ ఫ్యాకల్టీ ప్రొఫెసర్ దాదాపు రూ.24.66 లక్షలు పోగొట్టుకున్నారు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. స్థానిక తాటితోపులో కాపురమున్న ఎస్వీయూలో ఫ్యాకల్టీ ప్రొఫెసర్ సెల్‌ఫోనుకు వచ్చిన మెసేజీతో ఈ ఏడాది జనవరి 12న ఏ7 వీఐపీ షేర్‌ఖాన్ కమ్యూనికేషన్ గ్రూపులో చేరారు. ఈ గ్రూపులో అప్పటికే చాలా మంది చాటింగ్ చేస్తూ అధిక లాభాలు కలిగించే ఆన్‌లైన్ ట్రేడింగ్ అవకాశాలను ఎరగా చూపారు. షేర్‌ఖాన్ అధికారిక పేరుతో ఉన్న గ్రూపులో నుంచి ఆయనకు లింకులు పంపారు. దీనిపై వెంటనే షేర్‌ఖాన్ సెక్యూరిటీస్ అనే ఫేక్ ట్రేడింగ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా ఆయన్ను ప్రోత్సహించారు. ఈ యాప్ ద్వారా భారీ లాభాలు వస్తాయని నమ్మించారు. దీంతో ఆ ఫ్యాకల్టీ ప్రొఫెసర్ తన బ్యాంకు ఖాతా నుంచి వివిధ ఖాతాలకు దాదాపు రూ.24.66 లక్షలు పంపారు. ఆ తర్వాత అతడి ఇన్వెస్ట్‌మెంట్ పోర్టుఫోలియోలో 2,14,14,240 రూపాయలు ఉండటాన్ని గుర్తించారు. తన ఖాతా నుంచి డబ్బును విత్‌డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా ముందుగా లోన్ అమౌంటు చెల్లించాలని నేరగాళ్ళు ఒత్తిడి తీసుకొచ్చారు. దీనిపై మోసం జరిగిందని గుర్తించి సైబర్ క్రైం నెంబరు 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనుల పండువగా కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు



చంద్రగిరి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. ఈక్రమంలో ఏడవ రోజు సోమవారం స్వామివారు సూర్య, చంద్రప్రభ వాహనాలపై భక్తులను దర్శనమిచ్చారు. ఉదయం స్వామి కి నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించాక ఉత్సవమూర్తిని వాహన మండపానికి తీసుకొచ్చారు. కల్యాణ వెంకన్న సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అనంతరం 10 నుంచి 11 గంటల వరకు ఉత్సవర్లను కళ్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. శాస్త్రోక్తంగా పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్ళు, సుంగధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం భక్తిశ్రద్ధలతో ఊంజల్ సేవను నిర్వహించారు. రాత్రి తిరుమాడ వీధుల్లో వృషభ, అశ్వ, గజరాజులు ముందు కదులుతుండగా మేళతాళాలు, మంగళవాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటాలు, గోవింద నామ స్మరణల నడుమ స్వామివారు చంద్రప్రభ వాహనంపె భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, కంకణ భట్టర్ నారాయణాచార్యులు, ఏఈవో గోపినాథ్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, పార్థసారధి, శేషాచార్యులు, సూపరిండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధనశేఖర్, ఆలయ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి

కన్నుమూసే వరకు పెన్నుమూయను

● సినీ గేయ రచయిత సుద్దాల



అశోక్‌తేజను సన్మానిస్తున్న ఐక్యవేదిక నాయకులు

తిరుపతి(ఆటోనగర్) ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): దళిత బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కన్నుమూసే వరకు పెన్ను మూసేది లేదని సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ స్పష్టం చేశారు. దళిత బలహీన వర్గాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తిరుపతిలో సోమవారం ఓ హోటల్లో ఆయన్ను ఘనంగా సన్మానించారు. సుద్దాల మాట్లాడుతూ శ్రమజీవుల కష్టం నుంచే తన కలం పాటలు రాయడం మొదలుపెట్టిందన్నారు. వారికోసం తన సాహితీ పోరాటం కొనసాగిస్తానని చెప్పారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఐక్యవేదిక అధ్యక్షుడు వెంకటకృష్ణ, పి.అంజయ్య మాట్లాడుతూ శ్రమజీవుల కష్టాలను సమాజానికి తెలిపిన గొప్ప కవి సుద్దాల అశోక్‌తేజ అని కీర్తించారు. ఈ కార్యక్రమంలో అభిమానులు, వేదిక సభ్యులు వి.నాగరాజు, రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి, పాటకం వెంకటేష్, తాళూరి ప్రసాద్, డి.శ్రీనివాసులు రెడ్డి, పోలీసు బాబు, ఎస్.కె.బాబు, ఎం.చంద్రారెడ్డి, తోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ఎలక్ట్రికల్ వీల్‌చైర్ అందజేత



తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం కొండల్లో ఆదవరం గ్రామానికి చెందిన దివ్యాంగుడు వలమల వెంకటేశ్వర్‌కు కలెక్టర్ వెంకటేశ్వర్ రూ.60వేలు విలువచేసే బ్యాటరీ కమ్ ఎలక్ట్రికల్ వీల్‌చైర్‌ను అందజేశారు. ఇటీవల సీఎం చంద్రబాబు జిల్లా పర్యటనకు వచ్చినపుడు వీల్‌చైర్ అందజేయాలని వెంకటేశ్వర్ వినతిపత్రం అందజేశారు. ఆయన ఆదేశాల మేరకు సోమవారం కలెక్టరేట్‌లో అందేశారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెస్‌లో రాణించిన చిన్నోడు



నందన్ మునిరెడ్డిని అభినందిస్తున్న చెస్ అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి(క్రీడలు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): యూత్ హాస్టల్లో సోమవారం జరిగిన జిల్లాస్థాయి చెస్ టోర్నమెంటులో పుత్తూరుకు చెందిన బాల క్రీడాకారుడు నందన్ మునిరెడ్డి అత్యుత్తమంగా రాణించాడు. అండర్ 15విభాగంలో ప్రత్యర్థిపై ఆదిపత్యం కొనసాగించి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాడు. జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాసమూరి, టోర్నమెంట్ డైరెక్టర్ ఇంజం శివకేశవులు బాలుడికి సర్టిఫికెట్ అందజేసి, అభినందించారు.

రేపు సుషుమ్న క్రియా యోగ ధ్యాన దీక్ష



వివరాలు వెల్లడిస్తున్న శృతికీర్తి తదితరులు

తిరుపతి(లీలామహల్), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక తారకరామ స్టేడియంలో బుధవారం మహాశివరాత్రిని పురస్కరించుకుని సాయంత్రం నుంచి 27వ తేదీ ఉదయం వరకు ఆత్మానందమయి అమ్మ ఆధ్వర్యంలో సుషుమ్న క్రియా యోగ ధ్యాన దీక్ష శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సభ్యురాలు డాక్టర్ శృతికీర్తి తెలిపారు. సుషుమ్న క్రియ యోగా ఫౌండేషన్, ఎస్వీ యూనివర్శిటీ సంయుక్తంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం ఓ హోటల్‌లో ఆవిష్కరించారు. ఉచిత ప్రవేశం ఉంటుందని, నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పదేళ్లుగా కాలినడకన శ్రీవారి దర్శనం



తిరుపతికి చేరుకున్న కర్ణాటక భక్తబృందం

తిరుపతి(కపిలతీర్థం), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా స్వగ్రామం నుంచి తిరుమలకు కాలినడకన వచ్చి వేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకుంటున్నట్లు కర్ణాటకకు చెందిన భక్త బృందం తెలిపింది. కర్ణాటక రాష్ట్రం రాయచూర్, కస్తూరి తాండాకు చెందిన 15 మంది భక్తులు ఈనెల 14వ తేదీన బయలుదేరి సోమవారం మధ్యాహ్నం అలిపిరి మెట్ల వద్దకు చేరుకున్నారు. రాయ్‌పూర్, ఆదోని, తాడిపత్రి, కడప, తిరుపతి మీదుగా వచ్చామని తెలిపారు. గోవింద నామస్మరణతో తిరుమలకు వెళ్లారు.

బకాయిలకు నిధులు కేటాయించండి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆపస్ నాయకులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) కోరింది. సంఘం తిరుపతి జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం బైరాగిపట్టెడలోని ఆపస్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించారు. పెండింగ్ బకాయిలతో పాటు మధ్యంతర భృతికి బడ్జెట్లో నిధులు కేటాయించాలని తీర్మానించారు. జిల్లా అధ్యక్షుడు తూకివాకం నాగరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులు వారి జీతాల్లో నుంచి దాచుకున్న సొమ్ముతోపాటు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. 62 సంవత్సరాల సర్వీసును 60ఏళ్లకు కుదించాలని డిమాండ్ చేశారు. చివరిగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు సుభాష్ చంద్రదాస్, మేకల సుబ్రహ్మణ్యం, దామోదర నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు ధనంజయలు, రవిబాబు, వెంకటేష్, ప్రసాద్, మనోహర్, కోశాధికారి పట్టాభి, ఉపాధ్యాయులు సౌజన్య, లత, దేవి, తిరుపతి డివిజన్ కన్వీనర్ విజయసింహారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా తిరుపతి ఆవిర్భావ దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న సభ్యులు

తిరుపతి(కపిలతీర్థం), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో తిరుపతి 895వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం అలిపిరి మెట్ల వద్ద ఘనంగా నిర్వహించారు. యాదవ కులస్తులు ఈజీ గోపీయాదవ్ 101 టెంకాయలు కొట్టి, భక్తులకు అన్నదానం చేశారు. సమితి సభ్యుడు డీఎంసీ భాస్కర్ మాట్లాడుతూ తిరుపతి వాసులు సుఖసంతోషాలు, అష్టఐశ్వర్యాలతో వర్ధిల్లేలా వేంకటేశ్వరస్వామి కరుణించాలని వేడుకున్నారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఎస్‌కే.బాబన్న, దుద్దేల బాబు, బొమ్మగుంట రవి పాల్గొన్నారు.

నకిలీ ఫెవీక్విక్ విక్రేత అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నకిలీ ఫెవీక్విక్ విక్రయిస్తున్న దుకాణ యజమానిని తిరుపతి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అతని నుంచి భారీ సంఖ్యలో నకిలీ ఫెవీక్విక్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ కథనం మేరకు.. కూరగాయల మార్కెట్‌లోని సాయి వరుణ్ స్టోర్సులో నకిలీ ఫెవీక్విక్ విక్రయిస్తున్నట్లు కంపెనీ ప్రతినిధి భరత్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. ఆ మేరకు దుకాణ నిర్వాహకుడు ఆనంద్‌ను అరెస్టు చేశారు.

సమ్మె విరమించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ, అధికారులు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె 22వ రోజు సోమవారమూ కొనసాగింది. వర్సిటీ ప్రధాన గేటు ఎదురుగా దీక్షా శిబిరంలో బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల వద్దకు అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య, వివిధ విభాగాల ప్రొఫెసర్లు, అధ్యాపకులు వచ్చి సమ్మెను విరమించి తరగతులకు హాజరుకావాలని సూచించారు. పరిపాలనా భవనంలోని వీసీ చాంబర్‌లో విద్యార్థులతో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీ రమణ, డీన్ ప్రొఫెసర్ కె.వీరబ్రహ్మయ్య, డీఈ ప్రొఫెసర్ శోభామణి, టీపీటూవీసీ ప్రొఫెసర్ ఎంవీఏఎన్ సూర్యనారాయణలతోపాటు టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కలసి చర్చించారు. సమ్మె విరమించి తరగతులకు హాజరుకావాలని కోరారు. విద్యార్థులు మాట్లాడుతూ ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తే విరమిస్తామని, అప్పటివరకూ కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

వర్మీకంపోస్ట్ స్టాల్‌ను సందర్శించిన డీపీవో



స్టాల్ వద్ద వర్మీకంపోస్ట్ కొనుగోలు చేస్తున్న రైతు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో పెరుమాళ్లపల్లె గ్రామపంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్మీకంపోస్ట్ విక్రయ స్టాల్‌ను సోమవారం డీపీవో సుశీలదేవి సందర్శించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సెల్లింగ్ స్టాల్‌ను సందర్శించి, ఎరువును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ చెత్తను వేరుచేసే శాస్త్రీయ పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించి, భాగస్వామ్యం చేయాలని కోరారు. కాగా శాస్త్రీయ పద్ధతులతో తయారు చేసిన ఎరువును ప్యాకెట్ల రూపంలో స్టాల్‌లో విక్రయాలు చేపట్టారు. గ్రేడ్‌5 కార్యదర్శి జానకిరామ్, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

న్యాయమూర్తిని కలసిన ఎస్పీ



తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తిరుపతి మూడవ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఎం. గురునాథ్‌ను సోమవారం ఎస్పీ హర్షవర్ధన రాజు మర్యాద పూర్వకంగా కలిశారు. కొంతసేపు పలు విషయాలపై చర్చించారు.

అంగన్‌వాడీల సమస్యలపై 10న మహాధర్నా

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం మార్చి 10న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.హరికృష్ణ తెలిపారు. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కొనసాగిన అగ్రి వర్సిటీ ఉద్యోగుల క్రీడా సాంస్కృతిక పోటీలు



క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థినులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ ఉద్యోగుల క్రీడా సాంస్కృతిక పోటీలు మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. సోమవారం వివిధ క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మంగళవారం ముగియనున్నాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ వర్సిటీ అనుబంధ కాలేజీలు, రీసెర్చ్ సెంటర్ల ఉద్యోగులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్ ప్రారంభం



కార్యక్రమంలో వీసీలు అప్పారావు, రాణీసదాశివమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 24 (ఆంధ్ర జ్యోతి): ఎస్వీయూలో ఫిజిక్స్ విభాగం చేపట్టిన వారం రోజుల వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. ప్రారంభ సభలో ఎస్వీయూ వీసీ అప్పారావు, వేద వర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి పాల్గొని మాట్లాడారు. భారతీయ ప్రాచీన విజ్ఞానాన్ని ఆధునిక విద్యా విధానంతో అనుసంధానించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగాధిపతి ఆచార్య దేవప్రసాదరాజు, అధ్యాపకులు, సుమారు వందమంది ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఫార్మసీ కాలేజీ వార్షికోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఫార్మసీ కాలేజీ ఎనిమిదవ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ఫార్మసీ కాలేజీలో చేపట్టే సభలో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఇతర యూనివర్సిటీ, కాలేజీ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొంటారు.

ఉమ్మడి పీజీ సెట్ రద్దు కోసం..

4న యూనివర్సిటీలు, కాలేజీల బంద్



ఆందోళన చేస్తున్న విద్యార్థులు, విద్యార్థి నేతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీజీ ప్రవేశాల కోసం చేపట్టిన ఉమ్మడి పీజీ సెట్‌ను రద్దు చేయాలని కోరుతూ విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాయి. ఎస్వీ యూనివర్సిటీ పరిపాలనా భవనం వద్ద ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు పెద్ద సంఖ్యలో బైఠాయించి ఆందోళన చేపట్టారు. సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి పీజీ సెట్ వల్ల ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీల్లో పీజీ అడ్మిషన్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోందన్నారు. ప్రైవేట్ యూనివర్సిటీలకు పరోక్షంగా మేలు చేసినట్టు అవుతుందన్నారు. పీజీ ప్రవేశాల బాధ్యతలు ఆయా యూనివర్సిటీలకే ఇవ్వడం వల్ల అడ్మిషన్ల సంఖ్య పెరుగుతుందన్నారు. గత ప్రభుత్వ విధానాన్నే ఈ ప్రభుత్వమూ కొనసాగించడం తగదని అన్నారు. దీనికి నిరసనగా మార్చి 4వ తేదీన జిల్లాలోని అన్ని డిగ్రీ కాలేజీలు, యూనివర్సిటీలు బంద్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో బండి చలపతి (ఏఐఎస్ఎఫ్), అక్బర్ (ఎస్ఎఫ్ఐ), ఆశ (పీడీఎస్‌ఓ), మల్లికార్జున (ఎన్ఎస్‌యూఐ), తిరుమలేష్ (బీసీ విద్యార్థి సంఘం), సుందర్రాజు (లా విద్యార్థి సంఘం), నాయకులు భార్గవ్, స్రవంతి, ప్రవీణ్, ఉదయ్, వేణు పాల్గొన్నారు.

ప్రజలు సంతృప్తి చెందేలా

సమస్యలు పరిష్కరించండి



ప్రజల నుంచి వినతులు తీసుకుంటున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు సమస్యలను విన్నవించారు. కేంద్ర ప్రభుత్వం పేదలకు కేటాయించిన ఇండ్లను వారికి ఇప్పించాలని మాజీ ఎంపీ చింతామోహన్ వినతిపత్రం ఇచ్చారు. గొల్లవానిగుంటలో ఇంటింటి చెత్త సేకరణ చేయించాలని, సుందరయ్య నగర్ రోడ్లలో గుంతలు పూడ్చాలని, టీడీఆర్ బాండ్లు ఇప్పించాలని, ఇళ్ల కోసం డబ్బులు కట్టామని, తిరిగి ఇప్పించాలని, ఎస్వీ పూర్ హోం వద్ద మురుగునీరు ఇళ్లపైకి వస్తున్నాయి అరికట్టాలని, తిలక్ రోడ్డులోని కాలువలో చెత్త పేరుకుపోయింది తొలగించాలని, సుభాష్ నగర్‌లో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, ఎంఈలు తులసి కుమార్, గోమతి, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్, డీసీపీ మహాపాత్ర, ఆర్వో సేతుమాధవ్, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలకు పన్నులు విధించండి

తిరుపతి, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలకు పన్నులు విధించాలని, చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం నగరపాలక సంస్థ పరిధిలోని 43, 44 వార్డులలో కార్పొరేటర్ నారాయణ, హెల్త్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కలిసి పారిశుధ్య పనులను, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని పలు ఖాళీ స్థలాలు అపరిశుభ్రంగా ఉండటం పట్ల ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సంబంధిత అధికారులు ఆ స్థలాలను పరిశీలించి పన్నులు వేసి పరిశుభ్రంగా ఉంచుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 22 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అతిగా మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 22 మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరిని సోమవారం తిరుపతి నాలుగవ అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ ఎదుట హాజరుపరచారు. ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున 22 మందికి రూ.2.20 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

చేపల వేలం వాయిదా

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని అన్నాచెరువు చేపల వేలం వాయిదా పడింది. వేలం పాటకు ఎవరూ ముందుకురాకపోవడంతో మరో అవకాశంగా శనివారానికి వాయిదా వేశారు. ఆ రోజున ఉదయం 11 గంటలకు వేలం ఉంటుందని సచివాలయ కార్యదర్శి మురళి తెలిపారు.

రుయాను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చాలి



నిరసన తెలుపుతున్న చింతా మోహన్, కాంగ్రెస్ నేతలు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాలకు తలమానికంగా ఉన్న రుయాను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయం ముందు ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. చింతా మాట్లాడుతూ రుయాస్పత్రి అరకొర సౌకర్యాలతో నడుస్తుండటం దౌర్భాగ్యమన్నారు. స్విమ్స్‌లో డబ్బు లేనిదే వైద్యం అందే పరిస్థితి లేదన్నారు. ఈ క్రమంలో నిరుపేదలకు సరైన వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తిరుపతిలో 7,008 మంది నిరుపేద మహిళలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించేందుకు రూ.292 కోట్లు విడుదల చేసిందని, తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఆ నిధులను పక్కదారి పట్టించాయని ఆరోపించారు. దామినేడులో కాంగ్రెస్ హయాంలో కట్టిన ఇందిరమ్మ ఇళ్లకు పసుపు రంగు వేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి నేతలు కుంభమేళాలకు వెళ్లి వస్తే పాపాలు పోవని, నిరుపేదలకు మంచి చేస్తే పోతాయని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపి గౌడ్, తేజోవతి, మునిశోభ, అబ్దుల్ మజీద్, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

కానిస్టేబుళ్ల కుటుంబాలకు ఆర్థిక చేయూత

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రిజర్వు హెడ్ కానిస్టేబుల్, పోలీసు కానిస్టేబుల్ కుటుంబాలకు ఎస్పీ హర్షవర్ధన రాజు ఆర్థిక చేయూత అందించారు. హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ భార్య సత్యవతికి పోలీసు ఐఆర్ నిధుల నుంచి రూ.లక్ష, వెంకటగిరి స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన కానిస్టేబుల్ వెంకటేష్ భార్య లతకు రూ.లక్ష చెక్కును అందచేశారు. ఏవో సురేష్ బాబు పాల్గొన్నారు.

నేడు ఆలిండియా విశాంత్ర స్టేషన్ మాస్టర్ల సదస్సు

తిరుపతి(ఆటోనగర్) ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మంగళవారం ఆలిండియా రిటైర్డ్ స్టేషన్ మాస్టర్ల అసోసియేషన్ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.మురళీధర్ తెలిపారు. ఆర్టీసీ బస్టాండు ఎదుట ఉన్న పీఎల్ఆర్ గ్రాండ్ హోటల్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయకుమార్ హాజరవుతారని తెలిపారు.

నగర పరిసరాల్లో ఇళ్లస్థలాలు కేటాయించండి



ఆర్డీవో కార్యాలయం ముందు భవన నిర్మాణ కార్మికులు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రదేశాలలోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని భవన నిర్మాణ కార్మికులు కోరారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్ఎస్‌లో ఆర్డీవో రామ్మోహన్, తహసీల్దార్ భాగ్యలక్ష్మికి వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. అఖిల భారత భవన నిర్మాణ కార్మికుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పి.సుబ్రహ్మణ్యంయాదవ్ ఆధ్వర్యంలో 150మంది భవన నిర్మాణ కార్మికులు ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలకు చేరుకుని ఆందోళన చేశారు. తామంతా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే పేదవారమని, కొన్నేళ్ల క్రితం ఇళ్ల స్థలాలు కేటాయించినా ఇప్పటివరకు స్థలాలు చూపించలేదని అన్నారు. నగరానికి 20 కిలోమీటర్ల దూరంలోని చిందేపల్లెలో ఇళ్లస్థలాలు ఇవ్వడం వల్ల ఎలాంటి ఉపయోగమూ ఉండదని తెలిపారు. వచ్చే కూలి డబ్బు చార్జీలకే సరిపోతుందన్నారు. స్పందించిన అధికారులు పరిశీలించి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

వ్యాపార మెలకువలపై శిక్షణ తరగతులు

తిరుచానూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని మహిళా ప్రాంగణంలో సోమవారం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు మాట్లాడుతూ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. ఓఎన్డీసీ, ఆన్‌లైన్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో వ్యాపారాభివృద్ధి, మార్కెటింగ్ మెలకువలపై అవగాహన కల్పించారు. స్త్రీనిధి ద్వారా పీఎంఈజీపీ, ముద్ర లోన్ వంటి రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు విశ్వనాథ్‌రెడ్డి, వెంకటరమణ, ఆర్.లోకనాథం, చంద్రారెడ్డి, పర్హానా తదితరులు పాల్గొన్నారు.

పోలీసు డైరీ ఆవిష్కరణ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన రాజు సోమవారం పోలీసు క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ డైరీలో పోలీసు శాఖకు సంబంధించిన పూర్తి సమాచారం పొందుపరచడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ హేమంత్, అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, నాగభూషణరావు, పరిపాలనాధికారి సురేష్ బాబు, పోలీసు యూనియన్ అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి 895వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో సోమవారం కళాకారులు పురాణ పురుషుల వేషధారణతో చేపట్టిన ర్యాలీ ఆకట్టుకుంది. రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపీనాథరెడ్డి మాట్లాడుతూ టీటీడీ, నగరపాలక సంస్థ అధికారికంగా తిరుపతి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించాలని కోరారు.

మాల గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు




తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాల గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎస్వీయూ అసిస్టెంట్ ఇంజినీర్ వెంట్రపాటి శ్రీనివాస రావు నియమితులయ్యారు. తిరుపతిలో నిర్వహించిన మాల గెజిటెడ్ అధికారుల సంఘం రాయలసీమ స్థాయి సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ మాల గెజిటెడ్ అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పదోన్నతుల్లో తగిన న్యాయం కోసం ప్రయత్నం చేస్తానన్నారు. శ్రీనివాసరావును ఏపీ మాల గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు జయరాం, దినకర మూర్తి, కృష్ణమూర్తి, మునెయ్య, శ్రీలక్ష్మి, గురు మూర్తి, మరియదాస్, దుర్గేష్ అభినందించారు.

నేటి నుంచి శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ మంగళ, బుధ, గురువారాల్లో జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. భక్తుల రద్దీని అనుసరించి మంగళవారం 87, బుధవారం 209, గురువారం 140 అదనపు బస్సులు నడపనుంది. ఇందులో తిరుపతి, కోడూరు-తలకోన, గుడిమల్లం, శ్రీకాళహస్తి-తిరుపతి, నాయుడుపేట, గూడూరు, పిచ్చాటూరు, తడ, చెన్నై, గుడిమల్లం, పుత్తూరు-సదాశివకోన, కైలాసకోన, మూలకోన, ఊత్తుకోట-సదాశివకోన, వరదయ్యపాళెం-అవంతి, కోట, నాయుడుపేట-పంబ్రంగం. పల్నాడు జిల్లాలోని కోటప్పకొండ, శ్రీశైలం, మదనపల్లెకు వెళ్లనున్నాయి. ఈ కారణంగా తిరుమల, కాణిపాకం, ఇతర ప్రదేశాలకు మూడు రోజుల పాటు బస్సుల కొరత ఏర్పడే అవకాశముంది.

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 14 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

- శనివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.55 కోట్లు
- ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,892
- తలనీలాలు సమర్పించినవారు: 25,930

పరమశివుడు ప్రతిష్ఠించిన యోగలింగం

- కైలాసనాథకోనలో హరోంహరా..



కైలాసనాథకోన జలపాతం



విశేష అలంకరణలో కైలాసనాథుడు



నారాయణవనం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రకృతి రమణీయత.. ఆధ్యాత్మికతల కలబోత కైలాసనాథకోన. ఉరికే జలపాతాలు.. ఎత్తయిన గిరులతో ఆహ్లాదకర వాతావరణం ఈ ప్రాంత ప్రత్యేకత. సాక్షాత్తూ పరమశివుడే ఇక్కడ అందాలకు ముగ్ధుడయ్యాడు. అందుకే ఇక్కడ కైలాసనాథుడిగా కొలువుదీరాడు. నారాయణవనం మండలం పాలమంగళం పంచాయతీ పరిధిలోని కైలాసనాథ కోనలో యోగలింగాన్ని దర్శించుకుని భక్తులు తాదాత్మ్యం చెందుతారు. హరుడి దర్శనం కోసం పరిసరాల నుంచే కాదు తమిళనాడు, కర్ణాటకల నుంచీ భక్తులు, పర్యటకులు వస్తుంటారు.

స్థల పురాణం

నారాయణవనంలో కల్యాణ వెంకన్న, పద్మావతీ దేవిల వివాహానికి ఆకాశరాజు పార్వతీ పరమేశ్వరులను ఆహ్వానించారని ఇతిహాస గాథ ప్రచారంలో ఉంది. ఆ క్రమంలోనే వచ్చిన శివపార్వతులు నయన మనోహరమైన కోన ప్రకృతిని చూసి ఆనందపరవశులయ్యారు. ఆ సమయంలోనే శంకరుడు యోగ లింగాన్ని ప్రతిష్ఠించాడని ప్రతీతి. ఈ విషయం తెలుసుకున్న అగస్త్య మహాముని కోనకు వచ్చి ఆరు మాసాలు తపస్సు చేశారని చెబుతారు. కల్యాణానంతరం వేంకటేశ్వరుడు లక్ష్మీ సమేతుడై వచ్చి పరమేశ్వరుడ్ని దర్శించుకుని అగస్త్య మహాముని ఆధ్వర్యంలో కామాక్షి అమ్మవారిని ప్రతిష్ఠించారంటారు. ఇది చాలా విశేషమైన ప్రదేశమని, పరమేశ్వరుడి జటాజూటం నుంచి గంగ జాలువారుతుందని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. స్వామికి కుడివైపు గంగాదేవి, ఎడమవైపు కామాక్షి దేవి కొలువుదీరి దర్శనమిస్తారు. కోనలో స్నానమాచరిస్తే కాశీలో పుణ్యస్నానం చేసినట్లు భావిస్తారు. వెంకట చలపతి మహత్యం పురాణంలో ఈ కోనశివుడి ప్రస్తావన ఉందని చెబుతారు.



కామాక్షి అమ్మవారు

భక్తుల తాకిడి


దేవదాయశాఖ పరిధిలోని కైలాసనాథకోన పర్యాటకులు, భక్తులతో సందడిగా ఉంటుంది. కార్తీక మాసంలో భక్తుల తాకిడి మరింత పెరుగుతుంది. ఈ పుణ్యతీర్థంలో స్నానమాచరించి, కైలాసనాథుడిని దర్శనం చేసుకుంటారు. కోనలో స్నానమాచరిస్తే సర్వపాపాలు హరించి, ముక్తి లభిస్తుందని నమ్ముతారు. అయ్యప్ప భక్తులు కూడా ఇక్కడ పుణ్యస్నానాలు చేసి మాలధరిస్తారు. శివరాత్రి సందర్భంగా ఇప్పటికే ఆధ్మాత్మిక సందడి ప్రారంభమైంది. బుధవారం వేడుక నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో కృష్ణనాయక్ తెలిపారు.

ఇలా చేరుకోవచ్చు..

పుత్తూరు నుంచి 13 కిలోమీటర్లు, నగరి నుంచి 20 కిలోమీటర్లు, తిరుపతి నుంచి 46 కిలోమీటర్లు, చిత్తూరు నుంచి 76 కిలోమీటర్లు ప్రయాణించి కైలాసకోన చేరుకోవచ్చు. పుత్తూరు బస్టాండు నుంచి రోజూ బస్సు సౌకర్యం ఉంది. నారాయణవనంలో దిగితే ఆటో, ఇతర వాహనాలుంటాయి. అటవీప్రాంతం కావడంతో రాత్రి వేళ ప్రయాణం క్షేమకరం కాదు. పర్యాటక శాఖకు చెందిన ఆరు, దేవదాయశాఖకు చెందిన మూడు అతిథిగృహాల్లో భక్తులు సేదతీరవచ్చు.

శ్రీమన్నారాయణుడి అభయం

సూర్య,చంద్రప్రభ వాహనాలపై దర్శనం



చంద్రప్రభ వాహనంపై కల్యాణ వెంకన్న



సూర్యప్రభ వాహనం

చంద్రగిరి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు సూర్య, చంద్రప్రభ వాహనాలపై భక్తులను అనుగ్రహించారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించాక ఉత్సవమూర్తి ధన్వంతరి అలంకరణలో సూర్యప్రభ వాహనంపై.. రాత్రి కృష్ణుడు అలంకరణలో చంద్రప్రభ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం రథోత్సవం జరగనుంది.





ప్రమాదం జరిగిన ప్రదేశంలో పోలీసులు, హైవే సిబ్బంది సహాయక చర్యలు - ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

టైరు పంక్చరవడంతో అదుపు తప్పి బస్సు బోల్తా

17 మందికి గాయాలు.. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చుట్టూ చీకటి. నిద్రమత్తులో ప్రయాణికులు. ఒక్కకుదుపుతో బోల్తాపడిన బస్సు. ఏమైందో.. ఏం జరిగిందో తెలియక ఒకటే అరుపులు. ఇదీ సూళ్లూరుపేటలోని మన్నారుపోలూరు క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారి పై ఆదివారం అర్ధరాత్రి దాటాక పరిస్థితి. పాండిచ్చేరి నుంచి విజయవాడకు ప్రయాణికులతో వస్తున్న మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ బస్సు ఆదివారం అర్ధరాత్రి దాటాక 1.30 గంటలకు క్రాస్‌రోడ్డు సమీపానికి వచ్చింది. ఆ సమయంలో టైరు పంక్చరు అయింది. వేగంగా వస్తున్న బస్సును డ్రైవరు అదుపు చేయలేకపోయారు. దీంతో హైవే రెయిలింగ్‌ను ఢీకొని దాదాపు 10 అడుగుల లోతులో బస్సు బోల్తాపడింది. ఎస్‌ఐ బ్రహ్మనాయుడు తన సిబ్బందితో అక్కడకు చేరుకొన్నారు. స్థానికుల సహకారంతో క్షతగాత్రులను బయటకు తీసి.. స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో 34 మంది ప్రయాణికులు ఉండగా, 17 మందికి గాయాలయ్యాయి. వీరిలో బస్సు రెండో డ్రైవర్ సాయి సిద్దేష్, ప్రయాణికుడు ఎ.చందుకు తీవ్ర గాయాలై, పరిస్థితి విషమంగా ఉండటంతో చెన్నైకి తరలించారు. బస్సు ముందుభాగం నుంచి సగం వరకు నుజ్జునుజ్జయ్యింది. ప్రమాదానికి కారణం అతివేగమేనని ప్రయాణికులు చెబుతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోల్తా పడిన కార్మికుల బస్సు



వరదయ్యపాళెం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం సాధనవారిపాళెం వద్ద అపాచీ పరిశ్రమ బస్సు బోల్తా పడింది. బుచ్చినాయుడు కండ్రిగ నుంచి తడ మండలం మాంబట్టు వద్ద ఉన్న అపాచీ పరిశ్రమకు కార్మికులతో బస్సు బయలుదేరింది. సోమవారం రాత్రి 7.30 గంటల సమయంలో బీఎన్‌కండ్రిగ- సూళ్లూరుపేట మార్గంలో సాధనవారిపాళెం సమీపంలో తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ బస్సును తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఐదుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కొందరిని 108 అంబులెన్స్‌లో బీఎన్‌కండ్రిగ ఆస్పత్రిలో చేర్పించగా మరో ఇద్దరిని సూళ్ళూరుపేట ఆస్పత్రికి తరలించినట్టు ఎస్‌ఐ మల్లికార్జున్ తెలిపారు.

వంద పడకల 'ఈఎస్‌ఐ'

- హోదా పెంచుతూ జీవో జారీ

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని 50 పడకల ఈఎస్ఐ(కార్మిక శాఖ బీమా)కి వంద పడకల హోదా పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీవో విడుదల చేసింది. ఈఎస్ఐ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రికి తీర్చిదిద్దుతామని 15 ఏళ్లుగా ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నా ఆ దిశగా ఏ ప్రభుత్వమూ చర్యలు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతనెల 2న నిర్వహించిన క్యాబినేట్ సమావేశంలో తిరుపతి ఈఎస్ఐ ఆస్పత్రిని వంద పడకలకు పెంచుతూ మంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది. ఆ దిశగా జీవో విడుదల చేసింది. అలాగే ఆస్పత్రిలో 26 మంది స్పెషలిస్టు డాక్టర్లను, 60 నర్సింగ్, పారామెడికల్, మరో 11 మంది కార్యాలయ సిబ్బందిని, 94 నర్సింగ్ ఆర్డర్లీ, స్వీపింగ్, సెక్యూరిటీ పోస్టులను కూడా భర్తీ చేసే విధంగా జీవోలో పొందుపరిచారు. వంద పడకల కల సాకార కావడంపై ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.



ఈఎస్ఐ ఆస్పత్రి



కలెక్టరేట్‌లో రద్దీ

అయ్యా! మా సమస్యలు పరిష్కరించండి

- కలెక్టరేట్‌కు క్యూ కట్టిన అర్జీదారులు
- పీజీఆర్ఎస్‌కు 241 వినతులు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): 'అయ్యా వారం వారం కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. మాపై దృష్టిపెట్టి కనికరించండి మహాప్రభో' అంటూ అర్జీదారులు కలెక్టర్ వెంకటేశ్వర్, ఇతర అధికారులకు మొరపెట్టుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు అర్జీదారులు పోటెత్తారు. 241 వినతులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా రెవెన్యూ శాఖకు 164 వచ్చాయి. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోష్మాండ్ తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.



పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పింఛను ఇప్పించి పుణ్యం కట్టుకోండి..



మాది నిరుపేద కుటుంబం. భర్త చనిపోయాడు. వితంతు పింఛను కోసం కొన్నేళ్లుగా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆరోగ్య సమస్యలున్నాయి. నెలసరి మందులు, వైద్య ఖర్చులకు డబ్బులు లేదు. పింఛను ఇప్పించి పుణ్యం కట్టుకోండి.

- అమీనాబీ, పుత్తూరు

నా ఆస్తి లాక్కుని వెళ్లగొట్టింది



నాకు పిల్లలు లేరు. బంధువు రమీజాబీ కుమార్తె హసీనాను దత్తత తీసుకుని పెంచి పెద్ద చేసి, చదివించాను. ఐదేళ్ల క్రితం నా భర్త అనారోగ్యంతో మరణించాడు. వృద్ధాప్యం కారణంగా హసీనా ఇంటికి వెళ్లాను. నా దగ్గర ఉన్న రూ.2లక్షల నగదు, భర్త ద్వారా నాకు సంక్రమించిన 10 తులాల బంగారం, నేను కాపురం ఉన్న (గొల్లవానికాలువ) ఇల్లు కూడా అప్పగించాను. కొన్ని రోజులు బాగానే చూసుకున్నా ఏడాదిగా చిత్ర హింసలకు గురిచేస్తోంది. తట్టుకోలేక గొల్లవాని కాలువలో ఉన్న నా ఇంటికి వచ్చేశాను. ఆ ఇంటిని అద్దెకు ఇచ్చేశారు. వారు ఖాళీ చేయడం లేదు. దయ ఉంచి నా కుమార్తె నుంచి నగదు, నగలు, ఇంటిని ఇప్పించి న్యాయం చేయండి.

- జమీలాబీ, గొల్లవానికాలువ, చంద్రగిరి

తాగునీటి బావిని కాపాడండి



సూళ్లూరుపేట మున్సిపాలిటీ కోళ్లమిట్టలోని ప్రభుత్వ భూమిలో బావి నిర్మించారు. చుట్టుపక్కల వారికి బాగా ఉపయోగపడుతోంది. ప్రస్తుతం కొందరు ఆ బావిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. రెవెన్యూ అధికారులు కూడా వారికి సహకరిస్తున్నారు. బావిని కాపాడండి.

- సయ్యద్ మోని, సూళ్లూరుపేట

పట్టా భూమిలో రోడ్డు నిర్మిస్తున్నారు



కాలనీ రోడ్డుకు ఇచ్చిన భూమిలో అధికారులు ఎలాంటి నోటీసూ ఇవ్వకుండా సిమెంటు రోడ్డు వేస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. పక్కన ఉన్న చెరువు, పంట కాలువలు, తూములు అన్యాక్రాంతం అయ్యాయి. మళ్లీ మా పట్టాభూమిలో చెరువుకట్ట ఏర్పాటు చేయాలని చూస్తున్నారు. విచారించి న్యాయం చేయండి.

- మునిశేఖర్, తనియాలి, డీవీ సత్రం

స్థలం కబ్జాను అడ్డుకోండి

కలెక్టరేట్ పక్కనే 45 ఏళ్ల క్రితం ప్రభుత్వం తమ కోసం కేటాయించిన 4 ఎకరాల స్థలం కబ్జాకు గురవుతోందని, కాపాడాలని షికారీలు కోరారు. ఇళ్ల కట్టుకోకుండా ఖాళీగా వదిలేసిన స్థలంలో అర ఎకరా మేరకు తిరుచానూరుకు చెందిన బాబు గోడ కట్టాడని తెలిపారు. తొలగించమని పలుమార్లు కోరినా దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని వివరించారు. రికార్డులు పరిశీలించి న్యాయం చేయాలని షికారీకాలనీ వాసులు శంకర తదితరులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు.



తిరుచానూరు షికారీ కాలనీవాసులు

చెరువు తూములో ఇరుక్కుని రైతు మృతి

రేణిగుంట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): చెత్తా చెదారాలను తొలగించే క్రమంలో చెరువులో పడి తూములో ఇరుక్కుపోవడంతో రైతు మృతిచెందారు. ఈ ఘటన ఏర్పేడు మండలం రాజులపాళెంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. రాజులపాళెం దళితవాడకు చెందిన రైతు ఎం.నడిపయ్య(50), మరో 14 మంది రైతులతో కలిసి సోమవారం ఉదయం సమీపంలోని చెరువు తూము నుంచి వృథాగా పోతున్న నీటిని అరికట్టేందుకు వెళ్లారు. తూము కింది భాగంలో చెత్తచెదారాలను తొలగిస్తుండగా చెరువులో పడి గేటు వద్ద ఇరుక్కుపోయారు. అతడిని కాపాడేందుకు సహచర రైతులు ఎంత కృషి చేసినా ఫలితం లేకుండా పోయింది. అరగంట తర్వాత విగతజీవిగా తూము నుంచి కొట్టుకొచ్చారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ జయచంద్ర తెలిపారు.

పుత్తూరు వార్తలు

ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించొద్దు

● మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికుల ధర్నా



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో ఆప్కాస్ పరిధిలో పనిచేసే తమను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించరాదంటూ పారిశుధ్య కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ... ఇప్పటి వరకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పారిశుధ్య కార్మికుల వేతన చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. ఈ బాధ్యతలను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తే కార్మికులు శ్రమదోపిడీతో పాటు వేతనాల్లో కోతలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపుల్లో జాప్యం జరిగే అవకాశం ఉందన్నారు. కార్మికుల బాధ్యతలను ఆయా మున్సిపాలిటీలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాలు పెంచాలని, జనాభా ప్రాతపదికన కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. మృతి చెందిన పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు పరిహారం నేటికీ చెల్లించలేదన్నారు. వారి స్థానంలో కుటుంబ సభ్యులకు ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్‌కు వినతిపత్రం అందించారు. విజయ్ కుమార్, ప్రభాకర్, తంగవేలు, సురేష్, కృష్ణారెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీసీసీబీ సీఈవో



పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను డీసీసీబీ నూతన సీఈవో శంకరబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఎమ్మెల్యే నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రైతులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని సీఈవోకు ఎమ్మెల్యే సూచించారు.

ప్రసన్న వెంకన్నకు కంఠాభరణం బహూకరణ



వడమాలపేట, ఫ్రిబవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వర స్వామికి టీటీడీ విశ్రాంత డిప్యూటీ ఈఈ రాధాకృష్ణారెడ్డి వెండి కంఠాభరణాన్ని బహూకరించారు. కడపకు చెందిన రాధాకృష్ణారెడ్డి, సరస్వతమ్మ దంపతులు సుమారు రూ.2 లక్షల విలువైన ఆభరణాన్ని టీటీడీ అధికారులకు అందజేశారు. దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్, సూపరింటెండెంట్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి మూడు కోనలకు 40 స్పెషల్ సర్వీసులు

పుత్తూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు సదాశివకోన, మూలకోన, కైలాసకోనలకు 40 స్పెషల్ సర్వీసులను నడుపుతున్నామని పుత్తూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రత్యూష తెలిపారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో సదాశివకోనకు 30 సర్వీసులు, మూలకోనకు ఐదు, కైలాసకోనకు ఐదు సర్వీసులను నడుపుతామని వివరించారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడి మృతి



భాస్కర్‌రాజు (ఫైల్ ఫొటో)

పుత్తూరు, ఫిబ్రవరి 24(ఆంధ్ర జ్యోతి): పుత్తూరు పట్టణ విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు భాస్కర్‌రాజు(70) సోమవారం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. 1983లో స్పెషల్ టీచర్ ఎంపికై తదనంతరం ఏపీటీఎఫ్ నాయకుడయ్యారు. నాయకులు ఈవీ గోపాలరాజు, ముద్దుకృష్ణమ, చెంగారెడ్డి, రోజాతో సన్నిహితంగా మెలిగాడు. విశ్రాంత ఉద్యోగ సంఘ భవన నిర్మాణానికి కృషి చేశారు.

శ్రీచైతన్యలో ఫ్యామిలీ బ్లూమ్ వేడుకలు

పుత్తూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పరమేశ్వర మంగళం శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం ఫ్యామిలీ బ్లూమ్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏజీఎం సురేష్ మాట్లాడుతూ పిల్లలకు కుటుంబ సంబంధాలు గుర్తుండేందుకు ఈ వేడుకలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించడం కోసం తడుకు పంచాయతీలో రైతు రిజిస్ట్రేషన్ నిర్వహించినట్లు ఏవో కోదండయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పథకాలు పొందాలంటే భూ యజమానులు తప్పనిసరిగా ఈ సంఖ్యను కలిగి ఉండాలన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ జరుగుతోందన్నారు.

పారిశుధ్యంతో ప్రజారోగ్యం

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తమ ఇంటి పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటారని తడుకు పంచాయతీ సర్పంచ్ బొబ్బిలియాదవ్ పేర్కొన్నారు. సోమవారం చెత్త బుట్టలను పంపిణీ చేశారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

రాస్‌లో కిసాన్ నిధుల విడుదల ప్రత్యక్ష ప్రసారం

రేణిగుంట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో పీఎం కిసాన్ 19వ నిధులు విడుదల ప్రత్యక్ష ప్రసారాన్ని నిర్వహించారు. సోమవారం చైతన్యపురంలో ఉన్న రాస్ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాదరావు, ఏపీ ప్రకృతి వ్యవసాయ పథకం జిల్లా మేనేజర్ షణ్ముగం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ బిహార్ రాష్ట్రంలోని భాగల్పూర్ జిల్లా వేదికగా 19వ విడత నిధులు విడుదల ప్రత్యక్ష ప్రసారం నిర్వహించగా రాస్ అనుబంధ రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు విశిష్ట సంఖ్య మొక్క ప్రాముఖ్యత, నమోదు విధానాన్ని రాస్ హెడ్ శ్రీనివాసులు వివరించారు.

బ్యూటీషియన్ శిక్షణ పొందిన మహిళలకు ధృవీకరణపత్రాల పంపిణీ

రేణిగుంట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాస్ జన్ శిక్షణ్ సంస్థ ఆధ్వర్యంలో బ్యూటీషియన్‌లో మూడు నెలలు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సోమవారం పాంచాలినగర్‌లోని రాస్ క్లస్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాస్ మహిళా పొదుపు సంఘాల సంచాలకుడు నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే చేతివృత్తులతోనే సాధ్యమన్నారు. సత్యనారాయణ, సుబ్బారావు, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు ఎడ్ల బండ్ల పందేలు

కోట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొక్కుపాడు మనలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఒంగోలు జాతి ఎడ్ల బండ్ల పందేలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, గూడూరు మండలాల్లోని ఒంగోలు జాతి ఎడ్ల బండ్ల పందేలు జరుగుతాయన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, నాలుగో బహుమతి రూ.5 వేలు, ఐదో బహుమతి రూ.3 వేలు అందజేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

సొన కాలువలు, చెరువుల మరమ్మతులకు రూ.16.23 కోట్లు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని సొన కాలువలు, చెరువుల మరమ్మతులకు రూ.16.23 కోట్లు మంజూరు చేసిన సీఎం చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నియోజకవర్గ పరిధిలోని సొన కాలువలు, చెరువుల మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. కూటమి ప్రభుత్వం నియోజకవర్గ పరిదిలోని చెరువులు, సొన కాలువల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం సంతోషకరమన్నారు.

ఎన్నికల బిల్లులు చెల్లించండి

వెంకటగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గతేడాది జరిగిన సాధారణ ఎన్నికల సందర్భంగా వీడియో చిత్రీకరణ కోసం పనిచేసిన తమకు బిల్లులు చెల్లించాలని ఫొటోగ్రాఫర్లు సోమవారం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఎన్నికలు జరిగి పది నెలలు గడుస్తున్నా ఇంతవరకు బిల్లులు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు.





వెంకటగిరి ప్రభుత్వాస్పత్రి - రోగుల లేక ఖాళీగా ఉన్న వార్డు

రోగమేదైనా రెఫర్ చెయ్యడమే

● వెంకటగిరి సీహెసీకి నిర్లక్ష్యపు జబ్బు
● కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిల్
● రక్త పరీక్షలూ అంతంత మాత్రమే
● ప్రైవేటు ఆస్పత్రులే జనానికి దిక్కు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 24: వెంకటగిరి పట్టణంలోని వంద పడకల ఆస్పత్రికి నిర్లక్ష్యపు జబ్బు పట్టుకుంది. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలకు పెద్దాస్పత్రి అయిన ఈ సీహెసీకి రోజుకు 180నుంచి 210 మంది వరకు రోగులు వస్తుంటారు. అయితే సమస్య ఏదైనా నామమాత్రంగా చికిత్స అందించి రెఫర్ చేయడం ఇక్కడి వైద్యులకు అలవాటుగా మారింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఉన్న ఈ ఆస్పత్రిని 2001లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్చి 30పడకలకు పెంచారు. ఆ ప్రకారం ఇక్కడ ఏడుగురు డాక్టర్లు విధుల్లో ఉండాలి. అయితే ప్రస్తుతం ఇద్దరు వైద్యులే ఉన్నారు. వారు రోజు మార్చి రోజు ఒకరు విధులకు వస్తున్నారు. రాత్రి పూట డాక్టరే అందుబాటులో ఉండడం లేదు. విధుల్లో ఉన్న వైద్యులూ చికిత్స అందించకుండా నామమాత్రంగా రోగులను పరిశీలించి జబ్బు ఏదో చెప్పకుండా తిరుపతికి వెళ్లాలని సూచిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక రాత్రివేళల్లో ఏదైనా ప్రమాదం జరిగి ఆస్పత్రికి వస్తే ప్రథమ చికిత్స చేసి తిరుపతికి రెఫర్ చేసేయడం పరిపాటిగా మారింది. జనరల్ సర్జన్ లేకపోవడంతో చిన్నపాటి ఆపరేషన్ చేయించుకోవడానికి కూడా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిగా గైనకాలజిస్టు లేకపోవడంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, గర్భిణులకు ప్రసవాలు చేయడంలేదు. ఇక డెంటిస్టు వారంలో మూడు రోజులు ఇక్కడ, మిగిలిన రోజుల్లో ఇతర పీహెచ్‌సీల్లో విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఫిజియోథెరపిస్టు, ఎక్స్‌రే టెక్నీషియన్లు ఎప్పుడు విధుల్లో ఉంటారో తెలియదని రోగులు చెబుతున్నారు. రక్త పరీక్షలు పూర్తి స్థాయిలో చేయడం లేదు. కేవలం టైఫాయిడ్‌కు మాత్రమే నమూనాలు తీసుకుంటున్నారు. డెంగ్యూ, మలేరియా వంటి పరీక్షలు చేయడానికి పరికరాలు లేవని, ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లాలని సూచిస్తున్నారు. దీంతో రోగులు ప్రైవేటు క్లినిక్‌లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇక డయాలసిస్ కేంద్రం ఏర్పాటు హామీ కాగితాలకే పరిమితమైంది. వెంకటగిరి నుంచి రోజూ 60 మంది వరకు రోగులు డయాలసిస్ చేయించుకునేందుకు తిరుపతికి వెళ్లి వస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంకటగిరి సీహెసీలో తగిన సంఖ్యలో వైద్యులను నియమించడంతో పాటు రోగులకు సరైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నాగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు



చెంగాళమ్మ ఆలయం వద్ద నుంచి పుట్టమట్టి తీసుకెల్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీహరిరెడ్డి, రాము, శాంతి, రాజశేఖర్ తదితరులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ వద్దనున్న నాగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చెంగాళమ్మ ఆలయం వద్దనుంచి పుట్టమట్టి తెచ్చి ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవ కమిటీ సభ్యులు చెంగాళమ్మ ఆలయం వద్దకు చేరుకొని అక్కడ్ని పుట్టవద్ద ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుతుల మంత్రోచ్ఛరణల నడుమ పుట్టమట్టిని నాగేశ్వరస్వామి ఆలయం వద్దకు తీసుకొచ్చి పూజలు చేసి శివరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ముప్పాళ శ్రీహరిరెడ్డి, నలజాం రాము, ఎం.శాంతి, తాటిపర్తి ఆది నారాయణ రెడ్డి, చెన్నం శ్రీనివాసులు, పి.రాజశేఖర్, ఎం.సాయికిరణ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో మహాశివరాత్రికి భారీ బందోబస్తు



ముక్కంటి ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. భద్రతా ఏర్పాట్లపై సోమవారం ఆయన శ్రీకాళహస్తిలో పర్యటించారు. ఆలయంలో క్యూలైన్లను తనిఖీ చేశారు. ఆలయ పరిసరాలు, సన్నిధివీధి, రాజగోపురం, చతుర్మాడవీధుల్లో పర్యటించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు అధికారులకు సూచనలు చేశారు. భక్తుల సౌకర్యార్థం 900మందికిపైగా పోలీసులను కేటాయించామని మీడియాకు తెలిపారు. మహాశివరాత్రి రోజున తాను శ్రీకాళహస్తిలోనే ఉండి భద్రతను పర్యవేక్షిస్తామన్నారు. శివారు ప్రాంతాల్లో కేటాయించిన స్థలాల్లోనే వాహనాలు నిలపాలని సూచించారు. 26వ తేదీ శివరాత్రి, 27న ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం, 28 రాత్రి శివపార్వతుల కల్యాణం సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు కట్టుదిట్టంగా అమలు చేస్తామన్నారు. డ్రోన్ సర్వేలెన్స్, ఈగల్ టీం, ఎస్డీఎఫ్ బృందాలను ప్రత్యేకంగా కేటాయిస్తున్నామన్నారు. ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

లక్ష వాటర్ బాటిళ్ల వితరణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా హైదరబాద్‌కు చెందిన భరత్‌రెడ్డి, అభిషేక్, అరవింద్ సింగ్ లక్ష వాటర్ బాటిళ్లను ఆలయానికి అందజేశారు. వీటిని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి రిషితారెడ్డి స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అధికారి రాజశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పిచ్చాటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): చోరీల పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటేష్ సూచించారు. ద్విచక్ర వాహన దారులు రికార్డులతో పాటు ఆధార్‌కార్డు కూడా ఉంచుకోవాలన్నారు. రాత్రి 10 గంటల తరువాత వాహన తనిఖీల్లో తప్పని సరిగా ఆధార్ చూపించాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ఉపయోగించకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్నారన్నారు. ప్రమాదం సమయంలో హెల్మెట్ రక్షణగా నిలుస్తుందని వాహనదారులకు అవగాహన కల్పించారు.

కేంద్ర మాజీ మంత్రికి ఘనస్వాగతం



రేణిగుంట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేష్‌కు తిరుపతి విమానాశ్రయంలో సోమవారం ఘనస్వాగతం లభించింది. తిరుమలేశుడి దర్శనార్థం విచ్చేసిన ఆయనకు కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్, కాంగ్రెస్ నాయకులు వి.ఆర్.రావణన్, గోపి గౌడ్, వెంకటేష్ గౌడ్, తేజోవతి, నాగరాజు తదితరులు ఆయనకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

రైళ్ల రద్దుతో ప్రయాణికులకు ఇక్కట్లు

తడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సదరన్ రైల్వే పరిధిలో కవర్‌పేట- పొన్నేరి మధ్య జరుగుతున్న రైల్వే పనుల నేపథ్యంలో పలు రైళ్లు రద్దు కావడంతో జనం ఇక్కట్ల పాలయ్యారు. కవర్‌పేట - పొన్నేరి మధ్య చెన్నై వైపు వెళ్లే అప్‌లైన్‌లో ట్రాక్ మార్పిడి పనులు జరుగుతున్నాయి. సోమవారం ఉదయం 9:30నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో పలు రైళ్లను పూర్తిగా రద్దు చేశారు. ముఖ్యంగా చెన్నై నుంచి నెల్లూరు వెళ్లే మెమో రైళ్లు, చెన్నై - సూళ్లూరుపేట- చెన్నై సబర్బన్ రైళ్లను సాయంత్ర 4గంటల వరకు పూర్తిగా రద్దు చేశారు. అలాగే విజయవాడ - చెన్నై - విజయవాడ మధ్య నడిచే పినాకిని ఎక్స్‌ప్రెస్‌ను గూడూరు నుంచి తిప్పి పంపారు. చెన్నై నుంచి నెల్లూరు వైపుగా వెళ్లే పలు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆలస్యంగా నడిపారు. సాయంత్రం 4గంటల తరువాత రాకపోకలను అనుమతి ఇచ్చారు.

ఆప్కాస్‌ను రద్దు చేయొద్దు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ నాయకులు అన్నారు. సోమవారం మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆప్కాస్‌ను రద్దు చేయొద్దంటూ సీఎంకు పోస్టుకార్డులను పంపారు. కూటమి అధికారంలోకి రావడంతో పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేస్తారని, సమానపనికి సమాన వేతనం చెల్లిస్తారనుకుంటే ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే యోచనచేయడం బాధాకరమని సీఐటీయూ నేతలు పేర్కొన్నారు.

భక్తులు మెచ్చేలా మహాశివరాత్రి ఏర్పాట్లు



ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ జడ్పీటీసీ రామచంద్రయ్య నాయుడు, ఎంపీడీవో గుణశేఖరరెడ్డి తదితరులు

డక్కిలి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): దేవుని వెల్లంపల్లిలోని స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయంలో మహాశివరాత్రికి భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు తెలిపారు. సోమవారం ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి ఏర్పాట్లను ఎంపీడీవో గుణశేఖర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య నాయుడు మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినాన భక్తులు స్వామి వారిని సులభంగా దర్శించుకొనేలా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు ఆలయం వెలుపల కోనేరు వద్ద అన్నదానం చేస్తున్నట్లు వివరించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

భట్లకనుపూరులో మహాశివరాత్రి ఉత్సవాలు

ఓజిలి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భట్లకనుపూరులో వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు సన్నద్ధమైంది. సోమవారం ఆలయం వద్ద ధర్మకర్తల మండలి సభ్యులతో పాటు ఈవో రవికృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు గున్నం మధురెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు బచ్చల రవీంద్రారెడ్డి, పూజారి సత్యనారాయణ శాస్త్రి సమావేశమై ఆలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లను సమీక్షించారు. ఆలయం వద్ద చేపట్టాల్సిన పోలీసు బందోబస్తు గురించి నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు కమిటీ సభ్యులతో చర్చించారు. ఆయన వెంట ఎస్ఐ స్వప్న, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో...

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వర్ణముఖి నది తీరాన వెలసిన ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం అంకురార్పణ, ధ్వజారోహణం చేశారు. బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి తెలిపారు.

బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలి



బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్‌తో పార్టీ నేతలు

గూడూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బూత్‌స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ముందుగా స్థానిక పోటుపాళెం జాతీయ రహదారి కూడలి నుంచి పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అందరం ఐకమత్యంతో మెలుగుతూ, కలిసికట్టుగా పార్టీ పటిష్ఠతకు పాటు పడాలన్నారు. కార్యక్రమంలో పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి, దయాకర్, ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, పనబాక కోటేశ్వరరావు, కోటారెడ్డి, శ్రీనివాసరావు, సురేష్‌బాబు, నరేంద్ర, మనోజ్‌కుమార్, ప్రకాష్‌నాయుడు, బిందురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాజ్‌పేయి ప్రతిభా పురస్కారాలు

గూడూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అనంతరం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో విద్యార్థులకు వాజ్‌పేయి ప్రతిభా పురస్కారాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేందుకు విద్యార్థులకు వాజ్‌పేయి పేరుమీద ప్రతిభా పురస్కారాలను అందజేయడం అభినందనీయమన్నారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వరి బస్తాకు రూ.500 బోనస్ ఇవ్వాలని, కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతాన్ని 22గా నిర్ణయించాలన్నారు. ఇదే డిమాండ్‌తో మంగళవారం ఉదయం 10గంటలకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

జగనన్న లే అవుట్‌లో అక్రమాలపై జేసీకి ఫిర్యాదు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిరుపతి రోడ్డులో ఉన్న జగనన్న లే అవుట్‌లో అక్రమాలు జరిగాయని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య జాయింట్ కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. లేఅవుట్‌లో 2511 ఇళ్లు మంజూరు అయ్యాయని, అయితే 2300 మందికి మాత్రమే పట్టాలు అందజేశారని తెలిపారు. మిగిలిన 211 ప్లాట్ల వివరాలు తెలియజేయడం లేదని, 150 ఇళ్లు పూర్తి చేసినట్లుగా లెక్కలు చూపించి హౌసింగ్ అధికారులు బిల్లులు స్వాహా చేశారని ఫిర్యాదు చేశారు. దీనిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని కోరారు.





శివరాత్రి ఉత్సవాల సందర్భంగా దేదీప్యమానంగా శ్రీకాళహస్తి





రావణ, మయూర వాహన సేవ ముందు పట్టణ ప్రముఖులు - వివిధ వేషధారణలో చిన్నారులు

నేడు శేష, యాళి వాహన సేవలు

ఐదో రోజున నాగరాత్రి




శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 25న మంగళవారం రాత్రి శివపార్వతులు బంగారు శేష, యాళి వాహనంపై పురవీధుల్లో విహరించనున్నారు. ఉదయం స్వామి అమ్మవార్లు బంగారు హంస, చిలుక వాహనాలపై విహరిస్తారు. ఉత్సవాల్లో ఐదో రోజు రాత్రిని నాగ రాత్రిగా వ్యవహరిస్తారు. నాగరాత్రి అంటే క్షీర సాగర మథనం ప్రారంభమైన తరువాత సకల నాగదేవతలు, నాగప్రముఖులు శివసాన్నిధ్యంలో నాట్య విన్యాసాలు ప్రదర్శించడం. అందులో భాగంగానే పరమశివుడు శేషవాహనంపై ఆధిపత్యం చెలాయిస్తూ పురవిహారం చేస్తారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు సేవా కమిటీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో మెరుగైన సేవలందించే లక్ష్యంగా దేవదాయ శాఖ 20మంది సభ్యులతో సేవా కమిటీని నియమించింది. ఈ మేరకు దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ముక్కంటి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై మంత్రుల కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించిన సందర్భంగా సేవా కమిటీపై చర్చించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సోమవారం శ్రీకాళహస్తికి చెందిన 20 మంది కూటమి నేతలను సభ్యులుగా నియమించారు. ఇందులో చెంచయ్యనాయుడు, లక్ష్మమ్మ, ఎం.రవి, జి.విజయకుమార్, జి.గోపీనాథ్, వి.గుర్రప్పశెట్టి, ఎం.మునిరాజాయాదవ్, కె.మల్లీశ్వరమ్మ, ఎం.జ్యోతి, నెమళ్లూరు సుబ్రహ్మణ్యం, జి.కృష్ణవేణి, పి.ప్రమీల, ఎన్.సూరినాయుడు, ఎం.సరస్వతి, కంఠారమేష్, బి.మునిలక్ష్మి, ఎం.సుబ్రహ్మణ్యం రెడ్డి, కొట్టే సాయి, అనిత, ఎ.సుమతి తదితరులున్నారు.

నేడు ముక్కంటికి పట్టువస్త్రాల సమర్పణ

శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయం తరపున స్వామిఅమ్మవార్లకు మంగళవారం పట్టువస్త్రాలను సమర్పించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం విడుదల చేశారు. మధ్యాహ్నం 2గంటలకు పట్టువస్త్రాలను సమర్పిస్తారన్నారు.

కైలాస కోనలో ఉచిత వైద్య శిబిరానికి ఏర్పాట్లు

నారాయణవనం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కైలాసనాథ కోనలో ఈ నెల 26న జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులకు వైద్య సేవలందించడానికి శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో మురళీకృష్ణ తెలిపారు. సోమవారం ఈ సందర్భంగా వైద్య శిబిరానికి నిర్వహణకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు అనారోగ్య అసౌకర్యాలు లేకుండా ఉచితంగా వైద్యసేవలను అందిస్తామని తెలిపారు. అలాగే ఉచితంగా మందులు కూడా పంపిణీ చేయాలని స్థానిక వైద్యాధికారులకు ఆదేశించారు. అందుబాటులో 108 అంబులెన్స్ సేవలు కూడా ఉంటాయని తెలిపారు. వైద్యులు దర్శిత్‌రాజ్, ఎంపీహెచ్‌వో రామాంజనేయులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరె కార్యదర్శిపై చర్యలు తీసుకోండి


ఎంపీడీవోకు సీపీఎం నాయకుల ఫిర్యాదు

కేవీబీపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తప్పుడు ధృవీకరణ పత్రం కారణంగా సామాజిక తనిఖీల సందర్భంగా తాను సస్పెన్షన్‌కు గురయ్యానని, దానికి కారకుడైన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని ఆరె పంచాయతీ కార్యదర్శి శశికుమార్ తప్పుడు మరణ ధృవీకరణపత్రం ఇచ్చాడని ఆయనపై చర్యలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ డిల్లీ బాబు, సీపీఎం మండల కార్యదర్శి దాసరి జనార్దన్ సోమవారం ఎంపీడీవో రాధారాణి, తహసీల్దారు మునిరత్నంరెడ్డికి వినతిపత్రాలు అందించారు. కేవీబీపురం మండలం ఆరె పంచాయతీలో కె.మురగేష్ ఆచారి 2023వ సంవత్సరం మే 8న అనారోగ్యంతో మృతి చెందాడన్నారు. అయితే మార్చిలో మరణించినట్లు కార్యదర్శి తప్పుడు ధృవీకరణపత్రం ఇచ్చాడన్నారు. ఈక్రమంలో మురుగేష్ ఆచారి ఏప్రిల్, మే నెలల్లో పింఛన్లు తీసుకున్నట్లు నమోదై ఉందన్నారు. ఇటీవల సామాజిక తనిఖీల్లో ఈ తేడాలను గుర్తించి బహిరంగ సభలో తనపై సస్పెన్షన్ వేటు వేశారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని తన వద్ద ఉన్న ఆధారాలను డిల్లీబాబు సోమవారం అధికారులకు సమర్పించారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక సర్వీసులు

సత్యవేడు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 25, 26, 27 తేదీల్లో సత్యవేడు డిపో నుండి 25 ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడుపుతున్నట్లు స్థానిక ఆర్టీసీ డీఎం వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఊత్తుకోట్టై నుండి సదాశివకోనకు, వరదయ్యపాళెం నుండి అవంతికోనకు ఈ ప్రత్యేక సర్వీసులు నడుస్తాయని వివరించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గజ వాహనంపై పరమశివుడి కటాక్షం

నాగలాపురం, ఫిబ్రవరి 24, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయ మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వాల్మీకేశ్వరుడు గజ వాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుకుల్ ఆలయంలోని పరివార దేవతలకు అభిషేకాలు చేపట్టారు. అనంతరం యాగశాలలో పూజలు నిర్వహించారు. సాయంత్రం మూలస్థాన మూర్తులైన వాల్మీకేశ్వర స్వామి, మరగదాంబిక అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి దీప, దూప నైవేద్యాలు సమర్పించారు. తదనంతరం వివిధ రకాల పుష్పాలతో, బంగారు ఆభరణాలతో, పట్టువస్త్రాలతో సుందరంగా అలంకరించి మహాహారతి చేపట్టారు. హారతి అనంతరం స్వామి వారిని గజవాహనంపై, సర్వమంగళాదేవిని పల్లకిపై అధిష్టింపజేసి మంగళవాయిద్యాల సవ్వడి, బాణసంచాల పేలుళ్ల నడుమ తిరువీధి ఉత్సవం నిర్వహించారు. స్వామిఅమ్మవార్లకు భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఈ పూజలకు కారణి గ్రామానికి చెందిన మాధవి, డిల్లిబాబు, జేబీ మునిరత్నం కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.



తిరువీధి ఉత్సవానికి గజ వాహనంపై బయలు దేరిన పరమేశ్వరుడు, పల్లకిలో అనుసరిస్తున్న పార్వతి - వాహన సేవ ముందు కోలాటాలు

మందులు, టీషర్టుల అందజేత




శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయానికి సాగర్ సిమెంట్స్ తరఫున నాయుడుపేటకు చెందిన డీలర్లు రమేష్, సురేష్ రూ.5 లక్షల విలువైన మందులు, టీషర్టులను వితరణ చేశారు. వాటిని ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలి స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రశ్నపత్రాలు పోలీస్‌స్టేషన్ చేరాయి. వాటిని ప్రిన్సిపాల్ పర్యవేక్షణలో పెట్టెలో పెట్టి సీజ్ చేసి భద్రపరిచారు. ఎస్‌ఐ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి వితరణ



నాగలాపురం, ఫిబ్రవరి 24, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఎస్‌పురం ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులకు సోమవారం పరీక్షా సామగ్రి అందించారు. ఎంఈవో బాబయ్య ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన ఎన్ఆర్ఐ యశ్వంత్‌కుమార్ 50 మంది విద్యార్థులకు ప్యాడ్లు, జామెట్రీ బాక్సులు, పెన్సిళ్లు, పెన్నులను వితరణ చేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం చెన్నకేశవులు, పాఠశాల కమిటీ చైర్మన్ గోపీ, వెల్ఫేర్ అసిస్టెంట్ గిరి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు




యడవల్లి శ్రీదేవి బృందం బుర్రకథ - చిన్నారి నృత్య ప్రదర్శన - సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తున్న ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, ఈవో బాపిరెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ధూర్జటి కళాప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాయంత్రం 4గంటలకు పట్టణానికి చెందిన సిద్ధయ్య భక్తిరంజనితో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.సాయంత్రం 4.30గంటలకు తిరుపూరుకు చెందిన గోదా నరసింహరావు భక్తిరంజని, 5గంటలకు యడవల్లి శ్రీదేవి బృందం బుర్రకథ, 6గంటలకు పట్టణానికి చెందిన లక్ష్మి సంధ్య భరత నాట్య ప్రదర్శన, 6.30గంటలకు హైదరాబాద్‌కు చెందిన మయూరి డ్యాన్స్ అకాడమీకి చెందిన సుప్రియ నృత్యప్రదర్శన ఆకట్టుకున్నాయి. 8.30గంటలకు విజయవాడకు చెందిన జస్మిత, దేవిక, రమ్యశ్రీ కూచిపూడి నృత్య ప్రదర్శన, 10గంటలకు అభిత భరతనాట్యం అలరించాయి. 11గంటలకు రాపూరుకు చెందిన పద్మనాభయ్య చేసిన సత్యహరిశ్చంద్ర నాటకం ఆకట్టుకుంది. వారికి ఈవో బాపిరెడ్డి, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు తీసుకోండి


తహసీల్దారు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి 1న జరిగే స్వామి అమ్మవార్ల కల్యాణం రోజున బాల్యవివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని బాల్యవివాహాల వ్యతిరేక పోరాట సమితి సభ్యులు కోరారు. తొట్టంబేడు తహసీల్దారును కలిసి వినతిపత్రం ఇచ్చారు. బాల్య వివాహాల నిర్మూలనకు దేవుని పెళ్లి రోజున చెక్‌పోస్టు పెట్టి తనిఖీలు నిర్వహించేవారన్నారు. అయితే రెండు సంవత్సరాలుగా ఏర్పాటు చేయడం లేదని తెలిపారు. చందమామల కోటయ్య, జనమాల గురవయ్య, పులి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థకు చెందిన రాజారెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమన్నారు. దేవుడి పెళ్లి అని మొక్కులు చెల్లించుకోవాలని... చిన్న వయసులోనే ఆడపిల్లలకు వివాహాలు జరిపిస్తున్నారన్నారు. ఇది చట్టరీత్యా నేరమన్నారు. ఒకవేళ ఇలాంటి సంఘటనలు మీ పరిధిలో జరిగితే నెం.1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఎంఈవో రవికుమార్, మహిళా పోలీసు కేథరిన్, ప్రగతిసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం



నాగలాపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నాగలాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం సోమవారం జరిగింది. 2004-06 పూర్వ విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత ఆధ్వర్యంలో ఈ సమ్మేళనం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కళాశాలలో పూర్వవిద్యార్థులు ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కళాశాల అభివృద్ధి పూర్వవిద్యార్థుల సహకారం ఎంతో అవసరమన్నారు.

నంది, కామధేనువుపై పార్వతీపరమేశ్వరుల విహారం

రేణిగుంట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నంది, కామధేనువు వాహనాలపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు పార్వతీ పరమేశ్వరులు. ఏర్పేడు మండలం గుడిమల్లంలోని పరశురామేశ్వరాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఉదయం నంది, సాయంత్రం కామధేనువు వాహనాలపై పార్వతీపరమేశ్వరులు ఊరేగారు. ఆలయంలో చండీ సహిత రుద్రయాగం నిర్వహించగా విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈవో రామచంద్రారెడ్డి, ఆలయ అర్చకులు, ఆలయ మాజీ చైర్మన్ గిరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ


రేణిగుంట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం ఏర్పేడు మండలంలోని బండారుపల్లి పంచాయతీలో పొలంలో తవ్వుతున్న ఫారంపాండ్ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం పాండ్ తవ్వడం వలన సేద్యం పెట్టుబడులు తగ్గించుకోవచ్చన్నారు. అలాగే నీటి నిల్వ కారణంగా భూగర్భజలాలు వృద్ధి చెందుతాయన్నారు. అనంతరం గ్రామంలో నిర్మించిన సిమెంటు రోడ్లను పరిశీలించారు. ఉపాధి హామీ అధికారి చంద్రశేఖర్ రాజు, జేఈ బాలాజీరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివచంద్ర, టీఏ రవీంద్రుడు, ఎఫ్ఏ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి


వెంకటకృష్ణయ్య(ఫైల్)

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుక్కంబాక్కానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచు వి. వెంకటకృష్ణయ్య(69) గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం సాయంత్రం మండల బీఎన్‌కండ్రిగకు వచ్చారు. ఒక్కసారిగా రోడ్డు మీద కుప్పకూలి పోయారు. దీంతో అక్కడ ఉన్న వారు ఆయన్ను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆయన్ను వేరే ఆస్పత్రికి తరలిస్తుండా మార్గమధ్యంలో మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రగాఢ సానుభూతి తెలిపారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం కుటుంబీకులను పరామర్శించారు. కాగా వెంకటకృష్ణయ్య భౌతికకాయానికి టీడీపీ నాయకుడు సుధాకర్ నాయుడు, కన్నయ్య నాయుడు, రవినాయుడు, మధునాయుడు, కార్తిక్‌నాయుడు, మునిచంద్రనాయుడు, మాజీ ఎంపీపీ బట్టా రమేష్ యాదవ్ తదితరులు నివాళులర్పించారు.

మహిళ మెడలోని చైన్ స్నాచింగ్



బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలవాయికి చెందిన మునిరాజమ్మ మెడలోని బంగారు బొందు చైన్‌ను గుర్తు తెలియని దుండగులు లాక్కెళ్లారు. మునిరాజమ్మ నెలవాయి నుంచి వెస్ట్‌వరత్తూరు సచివాలయానికి రైతు విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ కోసం నడుచుకుని వెళ్తుండగా మార్గమధ్యంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలోని చైను లాగారు. మునిరాజమ్మ చైన్‌ను గట్టిగా పట్టుకుని కేకలు వేయడంతో సగం చైన్‌ను తెంపుకుని మెరుపు వేగంతో మాయమయ్యారు. 9 గ్రాముల బంగారం చోరీ అయివుంటుందని బాధితురాలు చెప్పారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శివరాత్రి నిత్య ఉత్సవాల వివరాలు...

- ఉదయం 4.30 గంటలకు : మంగళ వాయిద్యాలు
- ఉదయం 5.00: గోపూజ, సర్వదర్శనం
- ఉదయం 6.00: ప్రథమ కాల అభిషేకం
- ఉదయం 7.00: ద్వితీయ కాల అభిషేకం
- ఉదయం 8.00: పరివార దేవాలయాల నైవేద్యం
- ఉదయం 9.00: శ్రీస్వామిఅమ్మవార్ల పురవీధుల ఉత్సవం
- ఉదయం 10.30: ఉచ్చికాల అభిషేకం
- సాయంత్రం 5గంటలకు: ప్రదోష కాలాభిషేకం
- రాత్రి 8గంటలకు స్వామి అమ్మవార్ల పురవీధుల ఉత్సవం
- రాత్రి 9.30 గంటలకు: దర్శనం ముగింపు